RNI No. TELTEL . 12/48343

# మహానది

MAHANADI TELUGU DAILY

రంగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 50 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | బుధవారం | మే | 27 | 2026 పేజీలు : 8 వెల : రూ.2.00


## మేము వెళ్ళగొట్టకముందు పారిపోండి

### అక్రమ వలసదారులకు బెంగాల్ సీయం హెచ్చరిక



కోల్‌కత్తా, మే 26:పశ్చిమ బెంగాల్‌లో అక్రమ వలసదారులపై కొత్తగా ఏర్పాటైన బీజేపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి సువేందు అధికారి అక్రమ చొరబాటుదారులకు అత్యంత తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు. 'ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోక ముందే.. మీ అంతట మీరే ఇక్కడి నుంచి పారిపోండి' అంటూ ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న విదేశీయుల చట్టం లోబడే తాము ఈ చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో ఎలాంటి కొత్త చట్టం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'తమ పౌరులను తిరిగి చేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని బంగ్లాదేశ్ ఇప్పటికే ప్రకటించింది.

## డ్రైవర్‌పై వేటు

# వెనక్కి..

- డ్రైవర్ అశోక్‌ను తొలగించాలన్న నిర్ణయాన్ని మార్చుకోవాలని మంత్రి పొన్నం సూచన
- రైతుల పక్షాన మాట్లాడటాన్ని స్వాగతిస్తున్నామన్న రవాణా శాఖ మంత్రి
- పెట్రోల్ ధరలపై నిరసన కన్నా ధాన్యం కొనాలని కాంగ్రెస్ నేతలకు డ్రైవర్ సలహా



**హైదరాబాద్,మే26**

కాంగ్రెస్ నేతల నిరసనపై విమర్శలు చేశాడన్న ఆరోపణలతో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌ను తొలగించడంపై చెలరేగిన వివాదానికి తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెరదించారు. డ్రైవర్ అశోక్‌పై తీసుకున్న చర్యను వెనక్కి తీసుకోవాలని, అతడిని విధుల్లో కొనసాగించాలని యాజమాన్యానికి సూచించినట్టు ఆయన మంగళవారం తెలిపారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. "డ్రైవర్ అశోక్ ఆర్టీసీ ఉద్యోగి కాదు, కేవలం అద్దె బస్సు డ్రైవర్ మాత్రమే. అయినప్పటికీ, అతను రైతుల పక్షాన మాట్లాడాడు.

## 'వికసిత భారత్' నిర్మాణానికి ఈ 12 ఏళ్ల

# పాలనే బలమైన పునాది

### మోదీ సర్కార్‌కు 12 ఏళ్లు 'విజయాల' ప్రచారానికి బీజేపీ భారీ ప్రణాళిక

- కేంద్రంలో మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంకు 12 ఏళ్లు పూర్తి
- దేశవ్యాప్తంగా '22 విజయాలు' ప్రచారం చేసేందుకు బీజేపీ ప్రణాళిక
- ఇది సుపరిపాలన, అభివృద్ధి ప్రస్థానంగా అభివర్ణించిన కమలదళం
- 'విధానాల పక్షవాతం' నుంచి దేశం బయటపడిందని కేంద్ర మంత్రుల వ్యాఖ్య



**న్యూఢిల్లీ,మే26,**

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నిన్నటితో 12 సంవత్సరాలు పూర్తయింది. ఈ దశాబ్ద కాలానికి పైబడిన ప్రస్థానాన్ని సుపరిపాలన, అభివృద్ధి, జాతీయ పరివర్తనకు చిరునామాగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభివర్ణించింది. ఈ మైలురాయిని పురస్కరించుకుని, దేశవ్యాప్తంగా భారీ ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తమ ప్రభుత్వం సాధించిన '22 ముఖ్యమైన విజయాలను' ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కేంద్ర మంత్రులు, బీజేపీ ముఖ్యమంత్రులు, ఎంపీలు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.ఈ 12 ఏళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, ఆర్థిక సంస్కరణలు, డిజిటల్ పాలన, విదేశాంగ విధానంలో సాధించిన విజయాలు, సామాజిక రంగంలో చేపట్టిన కార్యక్రమాలను ఈ ప్రచారం ద్వారా ప్రజలకు వివరించనున్నారు.ఈ 12 ఏళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, ఆర్థిక సంస్కరణలు, డిజిటల్ పాలన, విదేశాంగ విధానంలో సాధించిన విజయాలు, సామాజిక రంగంలో చేపట్టిన కార్యక్రమాలను ఈ ప్రచారం ద్వారా ప్రజలకు వివరించనున్నారు'సంకల్పం నుంచి సాఫల్యం' యాత్రగా అభివర్ణించిన నితిన్ నబిన్ ఈ సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ 12 ఏళ్ల ప్రస్థానాన్ని 'సంకల్పం నుంచి సాఫల్యం వరకు' సాగిన యాత్రగా అభివర్ణించారు. "2014 మే 26న ప్రారంభమైన ఈ శకం కేవలం ప్రభుత్వ మార్పు కాదు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం తిరిగి పొందిన ఆత్మవిశ్వాసం, సాంస్కృతిక పునరుజ్జీవనానికి చారిత్రక ఘట్టం" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' అనే మంత్రంతో పాటు అంత్యోదయ స్ఫూర్తితో ప్రభుత్వం పాలన సాగించిందని, సామాన్యుడి జీవితంలో మార్పు తెచ్చిందని అన్నారు.'వికాస్ భీ, విరాసత్ భీ' (అభివృద్ధి, వారసత్వం) రెండింటినీ సమతుల్యం చేశారని, ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపడం ద్వారా దేశం ఇప్పుడు మరింత సురక్షితంగా ఉందని తెలిపారు.

## అంతరిక్షంలోకి

# మానవ పిండాలు

### అంతరిక్షంలోకి కృత్రిమ మానవ పిండాలను పంపిన చైనా

**ఇంటర్నెట్ డెస్క్,మే26**

మానవ భవిష్యత్తు, అంతరిక్ష పరిశోధనల చరిత్రలో చైనా ఒక కీలక ముందడుగు వేసింది. తొలిసారిగా మానవ కృత్రిమ పిండాలను అంతరిక్షంలోకి పంపి, వాటి అభివృద్ధిపై ఒక సంచలన ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. మే 10న లాంగ్ మార్చ్ 7 రాకెట్ ద్వారా ప్రయోగించిన తియాన్‌జౌ-10 మిషన్, ఈ కృత్రిమ



పిండాలను తియాన్‌గాంగ్ స్పేస్ స్టేషన్‌కు విజయవంతంగా చేర్చింది.

# కీవ్‌ను తక్షణమే వీడండి

- రాబోయే రోజుల్లో ఉక్రెయిన్ పై తీవ్ర స్థాయిలో దాడులు చేస్తామన్న రష్యా
- విదేశీ దౌత్యవేత్తలు, అంతర్జాతీయ సంస్థల సిబ్బంది కీవ్ ను వదిలి వెళ్లాలని అల్టిమేటం
- \- అమెరికా సహా విదేశీ దౌత్యవేత్తలకు రష్యా తీవ్ర హెచ్చరికలు!



**ఇంటర్నెట్ డెస్క్,మే26**

అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం అత్యంత ప్రమాదకరమైన మలుపు తిరిగింది. గత నాలుగేళ్లుగా సాగుతున్న ఈ యుద్ధంలో ఇటీవల ఉక్రెయిన్‌పై సరికొత్త హైపర్‌సోనిక్ బాలిస్టిక్ క్షిపణి 'ఒరెష్నిక్'తో విరుచుకుపడిన రష్యా.. రాబోయే రోజుల్లో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై కంటిచూపుతోనే శాసించే స్థాయి భారీ దాడులు చేయబోతున్నామంటూ అధికారికంగా హెచ్చరించింది.

## పసిడి, వెండి

# ధరల పతనం

- ఇరాన్‌పై అమెరికా దాడులతో పతనమైన బంగారం, వెండి
- ఎంసీఎక్స్‌లో రూ.971 తగ్గిన బంగారం
- సుమారు రూ.5,000 పతనమైన వెండి

**ఇంటర్నెట్ డెస్క్,మే26**

బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. ఇరాన్‌పై అమెరికా సైన్యం తాజాగా దాడులు జరపడంతో సురక్షిత పెట్టుబడులుగా భావించే ఈ లోహాలపై అమ్మకాల ఒత్తిడి పెరిగింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో



బంగారం ఫ్యూచర్స్ సుమారు రూ.1,000 వరకు పడిపోగా, వెండి ఫ్యూచర్స్‌లో దాదాపు 2 శాతం మేర క్షీణత కనిపించింది.

## కోకాపేట్ కొత్తచెరువులో

# హైడ్రా యాక్షన్

### గోల్డ్ ఫిష్ విల్లాస్ ప్రహరీ గోడ కూల్చివేత!

**హైదరాబాద్,మే26,**

హైదరాబాద్ నార్సింగి పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధిలోని కోకాపేట్ కొత్తచెరువు పునరుద్ధరణ పనులు ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా చెరువుల పరిరక్షణే లక్ష్యంగా అక్రమ కట్టడాలపై విరుచుకుపడుతున్న హైడ్రా అధికారులు మరోసారి గట్టి చర్యలు చేపట్టారు. కొత్తచెరువు పరిధిని (ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్) ఆక్రమించి



నిర్మించినట్లు గుర్తించిన ప్రముఖ "గోల్డ్ ఫిష్ విల్లాస్"కు చెందిన ప్రహరీ గోడను హైడ్రా సిబ్బంది భారీ యంత్రాలతో కూల్చివేశారు.

## రాజాసింగ్‌కు సైబర్

# కేటుగాడి ఫేక్ కాల్

- ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ సెక్రటరీ దిలీప్ అని పరిచయం చేసుకున్న కేటుగాడు
- డిప్యూటీ సీఎం పీఏకు ఫోన్ చేసి అలాంటి వ్యక్తి ఎవరూ లేరని నిర్ధారించుకున్న రాజాసింగ్



**హైదరాబాద్,మే26**

సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకు చాలామందిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను లక్ష్యంగా చేసుకుని కుచ్చుటోపీ పెట్టేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వ ఉన్నతాధికారిగా పరిచయం చేసుకుని ఒక గుర్తు తెలియని వ్యక్తి మోసానికి తెరలేపగా, అప్రమత్తమైన రాజాసింగ్ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.



## ఇరాన్‌లో అమెరికా

# దాడులు

**ఇంటర్నెట్ డెస్క్,మే26**

కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ దక్షిణ ఇరాన్‌లో అమెరికా బలగాలు సోమవారం రక్షణాత్మక దాడులు నిర్వహించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇరాన్ బలగాల నుంచి తమ సైనికులకు ముప్పు పొంచి ఉన్నందునే ఈ దాడులు చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది.

## బాధితులకు న్యాయం జరగకపోతే

# మళ్లీ ఉద్యమిస్తాం

### తెలంగాణ గవర్నర్ ను కలిసిన కవిత... రేవంత్ సర్కారుపై ఫిర్యాదు

- భూసేకరణ బాధితుల సమస్యలపై గవర్నర్‌ను కలిసిన కవిత
- ఖమ్మం, పరిగి, ఆర్ఆర్ఆర్ బాధితుల సమస్యలను వివరించిన కవిత

**హైదరాబాద్,మే26**

రాష్ట్ర ప్రభుత్వ భూసేకరణ కారణంగా నిరాశ్రయులైన బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కె. కవిత గవర్నర్‌ను



కోరారు. మంగళవారం ఆమె ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, పలువురు బాధితులతో కలిసి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్‌భవన్‌లో కలిశారు.

## రాజమండ్రిలో పవన్ కల్యాణ్‌ను కలిసిన

# టాలీవుడ్ నిర్మాతలు

- రాజమండ్రిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో టాలీవుడ్ నిర్మాతల సమావేశం
- సింగిల్ స్క్రీన్ థియేటర్ల సమస్యలను పవన్ దృష్టికి తీసుకెళ్లిన నిర్మాతలు
- విద్యుత్ ఛార్జీల రాయితీ, కొత్త ఫిలిం పాలసీ తీసుకురావాలని విజ్ఞప్తి

**అమరావతి,మే26**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మంగళవారం రాజమండ్రిలో పలువురు ప్రముఖ టాలీవుడ్ నిర్మాతలు కలిశారు. పర్యటనలో భాగంగా నగరంలోని షెల్టన్ హోటల్‌లో బస చేసిన పవన్‌తో వారు సమావేశమై సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో మైత్రీ మూవీ మేకర్స్ అధినేత



వై. రవిశంకర్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ, షైన్ స్క్రీన్స్ నిర్మాత సాహు గారపాటి, కిలారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## రుతుపవనాల రాక

# ఆలస్యం

**హైదరాబాద్,మే26,**

దేశంలోకి నైరుతి రుతుపవనాల రాక ఈసారి మరింత ఆలస్యం కానుంది. సాధారణంగా మే చివరి వారంలో ప్రవేశించాల్సిన రుతుపవనాలు, వాతావరణ మార్పుల కారణంగా జూన్ మొదటి వారంలో కేరళను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేస్తోంది. వడగాల్పుల ప్రభావం పెరిగితే ఇది మరింత ఆలస్యం కావచ్చని నిపుణులు చెబుతున్నారు.

# శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

## - లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్



**మేడ్చల్, మహానది న్యూస్, మే 26:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని శామీర్ పేట తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులుఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రంగారెడ్డి ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలో ఈ తనిఖీలు చేపట్టారు. అనంతరం మీడియాతో ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. శామీర్‌పేట మండలం అలియాబాద్ ప్రాంతంలో సుమారు 30 ఎకరాల భూమి కన్వర్షన్‌కు సంబంధించి రైతు కన్సల్టెంట్ నుంచి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. ఎకరానికి లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ డ్రైవర్ ద్వారా రూ.2 లక్షలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కార్యాలయంలోని కీలక పత్రాలు, భూ అనుమతులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నామని, ఎమ్మార్వో సుచరిత తో పాటు ఆర్డీఓ కీసర రాజేష్ పలువురు సిబ్బందిని విచారిస్తున్నామని తెలిపారు.

పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా... 2024లో కూడా శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన ఎమ్మార్వో సత్యనారాయణ రూ.2 లక్షల లంచం కేసులో డ్రైవర్‌తో కలిసి ఏసీబీకి చిక్కిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. తాజాగా మరోసారి అదే కార్యాలయంలో ఏసీబీ దాడులు జరగడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

# లొంగిపోయిన మావోయిస్టు దంపతులు

## - చెక్కులు అందజేసిన డీజీపీ ఆనంద్



**హైదరాబాద్,మహానది న్యూస్, మే 26:** మావోయిస్టు పార్టీలో నాలుగున్నర దశాబ్దాల పాటు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ పని చేశారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మీడియా ఎదుట నరహరితోపాటు ఆయన భార్య ధనమ్మను తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టారు. లొంగిపోయిన వారిద్దరికి రూ.25 లక్షలు, రూ.20 లక్షలు చొప్పున డీజీపీ చెక్కులు అందజేశారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 47 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. అందులో తెలంగాణాకి చెందిన వారు ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఒకరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు 15, జార్ఖండ్ 13, ఒడిశాకు చెందిన 15 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని వివరించారు. 2024 నుండి ఇప్పటి వరకు 822 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు. మొత్తం 334 ఆయుధాలతో వీరంతా తెలంగాణా పోలీసులు ఎదుట లొంగిపోయారని చెప్పారు. ఇక తెలంగాణా పోలీసులు ముందు లొంగిపోయిన ఒడిశాకి చెందిన మావోయిస్టులను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించామని పేర్కొన్నారు.

మన రాష్ట్రానికి చెందిన మావోయిస్టులను త్వరలో వారి ప్రాంతాలకు వెళ్లి స్వయంగా కలుస్తానని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.

తెలంగాణాకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతితోపాటు జాడే రత్న బాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు లొంగిపోవాలని ఈ సందర్భంగా వారికి డీజీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు.

మీరు లొంగిపోతే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్‌తోపాటు సదుపాయాలు కల్పిస్తామని అజ్ఞాతంతో ఉన్న మావోయిస్టులకు డీజీపీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

మే 12వ తేదీన పోలీసుల ఎదుట నరహరి, ఆయన భార్య లొంగిపోయారు. వారిని ఈ రోజు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. ఈ సందర్భంగా వందల సంఖ్యలో మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. అలాగే పలువురు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు నిరంతరాయంగా చేపట్టిన కూంబింగ్ కారణంగా భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణించారు. ఇక ప్రభుత్వం ఎదుట లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం ప్రకటించిన రివార్డులు అందజేశారు. దీంతో దేశంలో దాదాపుగా మావోయిస్టు పార్టీ ప్రాబల్యం దాదాపుగా తగ్గిపోయింది.

# ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలి

## - ప్రభుత్వ సలహదారు వీహెచ్ తో బీసీ నేతల చర్చలు



**హైదరాబాద్, మహానది న్యూస్,మే 26:** ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును కాపాడాలని, బీసీ వర్గాలకు న్యాయం జరిగే విధంగా చూడాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ (బీసీ సంక్షేమం, అభివృద్ధి) సలహదారులు వి.హనుమంతరావుతో గుజ్జ సత్యంతో కూడిన ప్రతినిధి బృందం బీసీ విద్యార్థుల సమస్యలపై చర్చించారు.

అనంతరం గుజ్జ సత్యం మాట్లాడుతూ... బీసీ వర్గాల ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 7ను తక్షణమే రద్దు చేయాలని అన్నారు. బీసీ విద్యార్థులకు హాస్టల్ వసతులు, విద్యా సహాయ పథకాలను బలోపేతం చేయాలని కోరారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను మరింత విస్తృతపరచాలని అన్నారు. విద్యా హక్కు సామాజిక న్యాయ పరిరక్షణను అందించాలని అన్నారు. బీసీల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్కతో కలిసి చర్చించి పరిష్కారమయ్యేవిధంగా చూస్తానని వి.హనుమంతరావు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. బీసీ సమస్యల పరిష్కారం కోసం తనవంతుకృషి చేస్తానని వీహెచ్ అన్నారు. కార్యక్రమంలో మట్టా జయంతి గౌడ్, శంకరయ్య, అశోక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

## -ఆర్పిఐ (ఏ) జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు గౌడ్



**హైదరాబాద్, మహానది న్యూస్,మే 26:** తెలంగాణలో త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు జరిగే విధంగా ప్రభుత్వం తగుచర్యలు తీసుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వర రావు గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను ఆర్పిఐ(ఏ) ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కుల ప్రకారం తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, గ్రేటర్ పరిధిలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా రిజర్వేషన్లను పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. మహిళల రాజకీయ సాధికారత కోసం 33 శాతం రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో సామాజిక న్యాయం, సమాన ప్రాతినిధ్యం అత్యంత కీలకమని, బీసీ వర్గాల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్పిఐ(ఏ) నేతలు టి.రాజ్ కుమార్, జగన్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ సంగీత బదిలీ




**హైదరాబాద్,మహానది న్యూస్,మే 26:** ఇండియన్ బ్యాంక్‌బర్కత్ పుర బ్రాంచ్ చీఫ్ మేనేజర్ గా దాదాపు రెండున్నర సంవత్సరాలుగా పనిచేసి బ్యాంక్ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేసిన జె.సంగీత న్యూ నల్లకుంట బ్రాంచ్ కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బర్కత్ పుర బ్రాంచ్ లో నూతనంగా చీఫ్ మేనేజర్ గా బాధ్యతలు చేపట్టిన ఎం. అశోక్ కుమార్ కు స్వాగతం పలికారు.

జె.సంగీతకు బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది, బ్యాంక్ వినియోగదారులు ఘనంగా వీడ్కోలు పలికారు. సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సికింద్రాబాద్ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్, బ్యాంక్ సీనియర్ కస్టమర్ ఎన్. శరత్ శ్యామ్ ఆధ్వర్యంలో జె.సంగీతకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. బ్యాంక్ అభివృద్ధి కోసం అమె అందించిన సేవలను పలువురు ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో ఎ.సందీప్, పి.చైతన్య, పి.అభిలాష్, బి.స్వాతి, టి.రెడ్డప్ప రెడ్డి, ఎన్. కోటేశ్వర్ రెడ్డి, ఎన్. శరత్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.


# జననాల రేటు తగ్గడానికి స్మార్ట్ ఫోన్‌లూ కారణమే..

## పలు అధ్యయనాల్లో వెల్లడి..!



ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదల తీరు మందగించింది. మూడు దశాబ్దాల క్రితం భారత్ లో ఒక మహిళ సగటున 3.4 మంది పిల్లలకు జన్మనిచ్చేది. కానీ ఇప్పుడు ఆ సంఖ్య 2.0 కి పడిపోయింది. ఇది జనాభా స్థిరంగా ఉండటానికి అవసరమైన 2.1 కంటే తక్కువ. అయితే ఈ ధోరణి కేవలం భారతదేశానికే పరిమితం కాలేదు. ప్రపంచవ్యాప్తంగా చాలాదేశాల్లో జననాల రేటు తీవ్రంగా పడిపోతున్నది. కొన్ని దేశాల్లో అయితే మహిళలు సగటున ఒక్క బిడ్డకు కూడా జన్మనివ్వడం లేదు. పెరుగుతున్న జీవన వ్యయం, ఖరీదైన గృహ వసతి, ఆలస్యంగా పెళ్లిళ్లు చేసుకోవడం, కెరీర్‌పై ఒత్తిడి, మారుతున్న సామాజిక పోకడలు లాంటివే సంతానలేమికి కారణాలని ఇప్పటివరకు అంతా భావించారు. కానీ ఇటీవలి కాలంలో పరిశోధకులు మరో కొత్త కోణాన్ని వెలుగులోకి తెచ్చారు. అదే స్మార్ట్‌ఫోన్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ప్రభావం..! స్మార్ట్‌ఫోన్‌లు, కంప్యూటర్‌లు, టాబ్‌లు మొదలైన టెక్నాలజీ మానవ సంబంధాలను మార్చిపారేస్తున్నది. ఈ మార్పే పిల్లల్ని కనే వారి సంఖ్య తగ్గడానికి కారణమవుతున్నదని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. సిన్సినాటి విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు నాథన్ హడ్సన్, హెర్నాన్ మోస్కోసో-బోడో ఇటీవల అమెరికా, బ్రిటన్‌లలో 4జీ మొబైల్ ఇంటర్నెట్ రాకకు, జననాల రేటుకు మధ్య ఉన్న సంబంధంపై అధ్యయనం చేశారు. హై-స్పీడ్ మొబైల్ కనెక్టివిటీ ముందుగా వచ్చిన ప్రాంతాల్లో జననాల రేటు వేగంగా తగ్గినట్టు వారి పరిశోధనలో తేలింది. స్మార్ట్‌ఫోన్లు యువత ఒకరితో ఒకరు గడిపే విధానాన్ని ప్రాథమికంగా మార్చేశాయని, ముఖాముఖిగా కలుసుకోవడం తగ్గి, ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయం గడపడంవల్ల సంతానోత్పత్తిపై ప్రభావం పడి ఉండవచ్చని వారు విశ్లేషించారు. ఫైనాన్షియల్ టైమ్స్ విశ్లేషణ ప్రకారం కూడా అనేక దేశాల్లో స్మార్ట్‌ఫోన్‌ల వాడకం విస్తృతమైన తర్వాతే జననాలరేటు గణనీయంగా క్షీణించడం ప్రారంభమైంది. ముఖ్యంగా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో 2007 తర్వాత ఈ మార్పు స్పష్టంగా కనిపించింది. స్మార్ట్‌ఫోన్లను ఎక్కువగా వినియోగించే యువతలో ఈ తగ్గుదల మరింత ఎక్కువగా ఉంది. ఫిన్లాండ్‌కు చెందిన జనాభా నిపుణురాలు అన్నా రోట్‌కిర్చ్ ప్రకారం.. యువతలో సోషల్ మీడియా వాడకం పెరగడంవల్ల జంటల మధ్య లైంగిక సమస్యలు కూడా పెరుగుతున్నాయని తెలుస్తోంది. సోషల్ మీడియాలో కనిపించే ఆడంబరమైన జీవనశైలి, ఆర్థికపరమైన ఆందోళనలు, ఇతరులతో పోల్చుకోవడం వంటివి యువతలో అభద్రతా భావాన్ని, అస్థిరతను పెంచుతున్నాయని, దీనివల్ల వారు పిల్లల్ని కనేందుకు సిద్ధపడటం లేదని ఆమె వాదిస్తున్నారు. గతంలో టీవీ సీరియళ్లలో చిన్న కుటుంబాలను చూసి మహిళలు తక్కువ మంది పిల్లల్ని కన్నట్టు కొన్ని అధ్యయనాలు తెలిపాయి. ఇప్పుడు టీవీ కంటే ఎన్నో రెట్లు ప్రభావవంతమైన స్మార్ట్‌ఫోన్లు ఈ మార్పును మరింత వేగవంతం చేస్తున్నాయని నిపుణులు భావిస్తున్నారు.

# కిడ్నీలను కాపాడుకుందాం




2026లో వాతావరణం.. సాధారణం కంటే అధిక వేడిగా ఉంటుందని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తున్నది. ఈ క్రమంలో వడగాలుల ప్రభావం కూడా ఎక్కువే ఉండనున్నది. అయితే, వేడిగాలులు కిడ్నీల ఆరోగ్యాన్ని దెబ్బతీయస్తాయని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ పరిశోధకులు.. 2023లో ప్రపంచవ్యాప్తంగా 78.8 కోట్ల మంది దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులతో బాధపడుతున్నారని తేల్చింది. మన దేశం విషయానికి వస్తే.. 13.8 కోట్ల మందిలో కిడ్నీ సమస్యలు ఉన్నాయట. ఈ క్రమంలో హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్.. మూత్రపిండాల ఆరోగ్యాన్ని మరింత దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం అవుతున్నది. మన శరీరంలో కిడ్నీలు చాలా కీలకమైన పనులు నిర్వహిస్తాయి. రక్తాన్ని శుద్ధి చేయడమే కాకుండా, శరీర సమతుల్యతను కాపాడతాయి. రక్తం నుంచి వ్యర్థ పదార్థాలను బయటికి పంపిస్తాయి. శరీరంలో నీటి శాతాన్ని క్రమబద్ధీకరిస్తాయి. రక్తపోటు నియంత్రణ, ఎముకల ఆరోగ్యం, ఎర్రరక్త కణాల ఉత్పత్తిలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, తీవ్రమైన వేడి.. సున్నితమైన కిడ్నీల వ్యవస్థను గందరగోళంలోకి నెట్టేస్తుంది. ఫలితంగా, మూత్రపిండాల పనితీరు మందగించి.. ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇటీవలి కొన్ని అధ్యయనాలు బహిరంగ కార్మికులలో అధిక శాతం మంది దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించాయి. ఎక్కువ సమయంపాటు వేడికి గురవ్వడం, ఒత్తిడితోపాటు రీహైడ్రేషన్ లేకపోవడమే వారిలో కిడ్నీల సమస్యకు కారణమని నిపుణులు వెల్లడించారు. కాబట్టి, ఎండలు ముదరక ముందే.. కిడ్నీలను కాపాడుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సలహా ఇస్తున్నారు. దాహం వేసినప్పుడే కాకుండా.. సమయానుకూలంగా నీళ్లు తాగాలి.


# సంపాదకీయం

## డాలర్ స్థానంలో బ్రిక్స్

ప్రపంచ రాజకీయాల్లో ఇప్పుడు కొత్త రకమైన 'క్యూ' కనిపిస్తోంది. ఒకప్పుడు అమెరికా డాలర్ కనిపిస్తే చాలు జోహార్లు అర్పించిన దేశాలన్నీ, ఇప్పుడు 'మాకు ఈ డాలర్ వద్దు.. బ్రిక్స్ దోస్తీ ముద్దు' అంటూ ఆ దేశాల కూటమి ముందు క్యూ కడుతున్నాయి. ఐఎంఎఫ్ తాజాగా విడుదల చేసిన ఏప్రిల్, 2026 గణాంకాలను చూస్తుంటే, ఇది కేవలం ఒక కూటమిలా కాకుండా.. అమెరికా, యూరప్ దేశాలకు నిద్రలేకుండా చేసే ఒక 'ప్రత్యామ్నాయ ప్రపంచం'లా కనిపిస్తోంది. చైనా భారీ జీడీపీ నుంచి మొదలుకొని, పాలస్తీనా వంటి చిన్న దేశాల వరకు అందరూ ఈ క్లబ్‌లో మెంబర్‌షిప్ కోసం తహతహలాడుతుండటం చూస్తుంటే.. భవిష్యత్తులో వైట్ హౌస్ కంటే 'బ్రిక్స్' ఆఫీసు ముందే రద్దీ ఎక్కువగా ఉండేలా కనిపిస్తోంది. బ్రిక్స్ సభ్య దేశాల జీడీపీ లెక్కలు చూస్తుంటే, చైనా ఏకంగా వి20.85 ట్రిలియన్లతో అందనంత ఎత్తులో కూర్చుంది. దానికి పోటీగా భారతదేశం కూడా వి4.15 ట్రిలియన్లతో తన సత్తా చాటుతోంది. ఈ రెండు దేశాలు కలిస్తేనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సగానికి పైగా వాటా ఉండేలా ఉంది. బ్రెజిల్, రష్యా కూడా చెరో రెండున్నర ట్రిలియన్లతో తమ ఉనికిని చాటుకుంటున్నాయి. ఇక్కడ ఒక వింత ఉంది.. ఒకవైపు రష్యాపై ఇన్ని ఆంక్షలు ఉన్నా, దాని జీడీపీ మాత్రం నిలకడగా ఉండటం పాశ్చాత్య దేశాలకు మింగుడుపడని నిజం. సంక్షేమ పథకాలు, అప్పులతో కుస్తీ పడుతున్న దక్షిణాఫ్రికా, ఈజిప్ట్ వంటి దేశాలు కూడా ఈ భారీ ఇంజన్ల అండ చూసుకునే ధైర్యంగా అడుగులు వేస్తున్నాయి. ఈ జాబితాలో ఇండోనేషియా (వి1.54 ట్రిలియన్) వంటి బలమైన ఆర్థిక వ్యవస్థలు పూర్తి సభ్యులుగా మారుతుంటే, పాకిస్థాన్ (వి410 బిలియన్), శ్రీలంక (వి98 బిలియన్) వంటి దేశాలు మాత్రం దరఖాస్తు పట్టుకొని దీనంగా ఎదురుచూస్తున్నాయి. పాకిస్థాన్ పరిస్థితి చూస్తుంటే.. 'సభ్యత్వం ఇస్తే ఇయ్యండి కానీ, ముందు ఏవైనా లోన్లు ఉంటే చూడండి' అని అడిగేలా ఉంది. అప్పుల ఊబిలో ఉన్న దేశాలన్నీ బ్రిక్స్‌ను ఒక 'ఏటీఎం'లా చూస్తుంటే, అసలు సభ్య దేశాలు మాత్రం దీన్ని ఒక 'పొలిటికల్ వెపన్' (రాజకీయ ఆయుధం)లా వాడుకోవాలని ప్లాన్ చేస్తున్నాయి. ఇక సౌదీ అరేబియా లాంటి ధనిక దేశాలు కూడా చేరితే, బ్రిక్స్ దగ్గర ఆయిల్ కు, డబ్బుకు అస్సలు కొదవ ఉండదు. నైజీరియా నుంచి వియత్నాం వరకు దాదాపు 10 దేశాలు భాగస్వామ్య హోదాలో ఉంటూ లోపలికి రావడానికి గేట్ల దగ్గర వేచి చూస్తున్నాయి. వియత్నాం (వి527 బిలియన్), మలేషియా (వి516 బిలియన్) వంటి ఆగ్నేయాసియా పులులు ఈ కూటమిలో చేరితే, ఇక ఆసియా ఖండం మొత్తం బ్రిక్స్ గుప్పిట్లోకి వెళ్లడం ఖాయం. ఒకప్పుడు అభివృద్ధి చెందిన దేశాల జీ-7 (ఉ7) గ్రూపును చూసి భయపడిన ప్రపంచం, ఇప్పుడు బ్రిక్స్ ప్లస్ (బ్రిక్స్+) వైపు ఆశగా చూస్తోంది. ఈ కూటమిలో డేటా లేని క్యూబా, సిరియా వంటి దేశాలు కూడా ఉన్నాయంటే, ఇక్కడ ఆర్థిక స్థితి కంటే 'అమెరికా వ్యతిరేకత' అనే గూడు పుఠాణీనే ఎక్కువగా పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది. చిన్న దేశాల 'పెద్ద' కలలు కేవలం వి3.49 బిలియన్ల జీడీపీ ఉన్న సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ నుంచి, అంతర్యుద్ధాలతో అల్లాడుతున్న ఆఫ్ఘనిస్తాన్ వరకు అందరూ ఈ జాబితాలో ఉన్నారు. వీరందరికీ బ్రిక్స్ లో చేరడం అంటే ఏదో మంత్రదండం దొరికినట్లే అన్నంత ఆశ ఉంది. చైనా ఇచ్చే పెట్టుబడులు, భారత్ ఇచ్చే సాంకేతికత తమ దేశాలను మార్చేస్తాయని వారు నమ్ముతున్నారు. అయితే, ఇంత మంది ఒకే గూటి కింద చేరితే.. ఒకరి అభిప్రాయాలు ఒకరికి నచ్చుతాయా? లేక ఇది కేవలం ఫోటో షూట్లకే పరిమితం అవుతుందా? అన్నది భవిష్యత్తు తేల్చాలి. మొత్తానికి, బ్రిక్స్ విస్తరణ చూస్తుంటే.. 'డబ్బు ఉన్నవాడు, అప్పు ఉన్నవాడు, యుద్ధం చేస్తున్నవాడు.. అందరూ కలిశారు. ఇక డాలర్ గారే జాగ్రత్తగా ఉండాలి' అనిపిస్తోంది. ఐఎంఎఫ్ రిపోర్ట్ ప్రకారం ఈ కూటమి ఇలాగే పెరిగితే, ఇక ప్రపంచం ఢిల్లీ-బీజింగ్ చుట్టూ తిరగడం ఖాయం!

# కష్టపడినా గుర్తింపు రావట్లేదా?

## బుధ గ్రహ అనుగ్రహం కోసం ఇలా చేయండి..




జ్యోతిష్య శాస్త్రంలో బుధ గ్రహానికి ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉంది. ఒక వ్యక్తి మేధస్సు, మాట్లాడే తీరు, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, వ్యాపార దక్షత, వృత్తి జీవితంలో ఎదుగుదల వంటి అంశాలపై బుధుడి ప్రభావం ఎక్కువగా ఉంటుందని జ్యోతిష్య నిపుణులు చెబుతున్నారు. జాతకంలో బుధుడు బలహీనంగా ఉన్నప్పుడు ఉద్యోగంలో అనవసర ఆటంకాలు, సహచరులతో అపార్థాలు, సరైన అవకాశాలు దక్కకపోవడం, తీసుకున్న నిర్ణయాల్లో గందరగోళం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉంటాయని విశ్వసిస్తారు. అలాంటి పరిస్థితుల్లో బుధవారం రోజు కొన్ని ప్రత్యేక పరిహారాలు పాటిస్తే మానసిక ప్రశాంతతతో పాటు వృత్తి జీవితంలో స్థిరత్వం పెరుగుతుందని చెబుతున్నారు. ముఖ్యంగా క్రమశిక్షణ, సానుకూల ఆలోచనలు, పరిశుభ్రతతో పాటు ఈ జ్యోతిష్య సూచనలను పాటిస్తే మంచి ఫలితాలు పొందవచ్చని నమ్మకం. బుధ గ్రహానికి ప్రతీకగా ఆకుపచ్చ రంగును భావిస్తారు. అందుకే బుధవారం రోజున ఆకుపచ్చ రంగు దుస్తులు ధరించడం శుభప్రదంగా పరిగణించబడుతుంది. అలాగే పని చేసే ప్రదేశంలో ఆకుపచ్చ రంగు మొక్కలు లేదా చిన్నపాటి ఇండోర్ మొక్కలను ఉంచడం వల్ల సానుకూల వాతావరణం ఏర్పడుతుందని చెబుతారు. కార్యాలయంలో ఉండే చిన్న మొక్కలు కేవలం అందాన్ని పెంచడమే కాకుండా మానసిక ప్రశాంతతను కూడా కలిగిస్తాయి. ఇవి ఏకాగ్రతను పెంచి పనిలో చురుకుదనాన్ని తీసుకువస్తాయని విశ్వాసం ఉంది. ముఖ్యంగా ఎక్కువసేపు కంప్యూటర్ల ముందు పని చేసే వారికి ఇటువంటి పచ్చదనం మానసిక ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుందని అంటారు. కార్యస్థలం పరిశుభ్రతకు కూడా జ్యోతిష్య శాస్త్రంలో ప్రాధాన్యం ఇచ్చారు. చిందరవందరగా ఉన్న పని ప్రదేశం ప్రతికూల శక్తిని ఆకర్షిస్తుందని, అది పనితీరుపై ప్రభావం చూపుతుందని భావిస్తారు. అందుకే పని చేసే టేబుల్, ఫైళ్లు, కంప్యూటర్ పరిసరాలను ఎప్పుడూ శుభ్రంగా, క్రమపద్ధతిలో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా బుధవారం రోజున కార్యాలయం లేదా పని ప్రదేశాన్ని శుభ్రం చేసి సర్దుకోవడం వల్ల సానుకూల ఆలోచనలు పెరుగుతాయని చెబుతున్నారు. పరిశుభ్రమైన వాతావరణం మనసును ప్రశాంతంగా ఉంచి పనిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుంది. వాస్తు శాస్త్రం ప్రకారం ఉత్తర దిశ వృత్తిపరమైన ఎదుగుదలకు, కొత్త అవకాశాలకు సంకేతంగా భావించబడుతుంది. పని చేసే సమయంలో ఉత్తరం వైపు ముఖం పెట్టుకుని కూర్చోవడం వల్ల ఆలోచనల్లో స్పష్టత పెరుగుతుందని నమ్మకం. ఒకవేళ అది సాధ్యం కాకపోతే పని చేసే బల్లపై ఉత్తరం వైపు మొక్క లేదా చిన్న అలంకరణ వస్తువు ఉంచడం కూడా మంచిదని సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల సానుకూల శక్తి ప్రవాహం పెరిగి కెరీర్‌లో పురోగతి సాధించేందుకు సహాయపడుతుందని చెబుతున్నారు. బుధవారం రోజును విఘ్నాలను తొలగించే గణేశుడికి అంకితం చేసిన రోజుగా భావిస్తారు. అందుకే బుధవారం ఉదయం గణేశుడికి గరిక సమర్పించి ప్రార్థనలు చేయడం శుభప్రదంగా పరిగణించబడుతుంది. గణేశుడిని భక్తితో ప్రార్థించడం వల్ల నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం మెరుగుపడుతుందని, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని విశ్వసిస్తారు. ఉద్యోగంలో ఎదురయ్యే ఆటంకాలు తగ్గి కొత్త అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని చాలామంది నమ్ముతారు. దానధర్మాలకు కూడా జ్యోతిష్య శాస్త్రంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. బుధవారం రోజున ఆకుకూరలు, పండ్లు, తీపి పదార్థాలు పేదలకు దానం చేయడం వల్ల బుధ గ్రహ అనుకూలత పెరుగుతుందని చెబుతారు. ఇది కేవలం ఆధ్యాత్మిక విశ్వాసమే కాకుండా మనసుకు ప్రశాంతతను కూడా ఇస్తుంది. ఇతరులకు సహాయం చేయడం ద్వారా సానుకూల భావనలు పెరిగి మన జీవితంలో కూడా మంచి మార్పులు వస్తాయని పెద్దలు చెబుతుంటారు. అయితే ఈ పరిహారాలను కేవలం నమ్మకాలుగా మాత్రమే కాకుండా కష్టపడి పనిచేయడం, క్రమశిక్షణ, సమయపాలనతో కలిపి ఆచరించడం అవసరం. కృషి, పట్టుదల, సానుకూల ఆలోచనలు, ఆత్మవిశ్వాసంతో పాటు ఈ చిన్న జ్యోతిష్య సూచనలు కూడా కలిసి వస్తే ఉద్యోగ జీవితంలో పదోన్నతి, జీతం పెంపు, కొత్త అవకాశాలు వంటి విజయాలు సాధించే అవకాశం మరింత పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

# తెలంగాణలో నూకల జగడం...



నల్గొండ : నూకల జగడం ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. అటు రైతులకు, ఇటు రైస్ మిల్లర్లకు మధ్య ఇది తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రవాణా చేస్తున్నా, తాము దింపుకోలేమంటూ కుండబద్దలు కొట్టినట్టుగా రైస్ మిల్లర్లు చెబుతున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, రైస్ మిల్లర్లకు ఎదురయ్యే కష్టాలను తొలగిస్తూ..సాఫీగా ధాన్యం కొనుగోళ్లు జరిపేలా చూసి, కావాల్సిన బియ్యాన్ని సేకరించాల్సిన కేంద్ర ప్రభుత్వం.. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పట్టించుకోకుండా, అసంబద్ధంగా రూపొందించిన నిబంధనల ఫలితమే.. ఈ నూకల జగడం. వాస్తవ పరిస్థితులను తెలిపినా, అటు కేంద్రం నుంచిగానీ.. ఇటు రాష్ట్రం నుంచిగానీ సానుకూల స్పందన రాకపోవడంతో చేసేదేమీ లేక రైస్ మిల్లర్లు సహాయనిరాకణకు దిగుతున్నారుఒక క్వింటాలు ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఎంతమేర బియ్యాన్ని ఇవ్వాలనేదానిపై రెండు రకాల పద్ధతులు ఉన్నాయి. ఇందులో పాత పద్ధతిలో అయితే.. ముడి బియ్యం (రా రైస్) విషయంలో 25 శాతం బ్రోకెన్ (నూక శాతం)తో కలుపుకుని 67 శాతం బియ్యం ఇవ్వాలని నిబంధన ఉంది.అంటే క్వింటాలు ధాన్యం మిల్లింగ్‌చేసి 67 కిలోల రా రైస్ ఇవ్వాలన్నమాట. ఇందులో 25 శాతం వరకు నూకలు ఉండవచ్చు. అదే బాయిల్డ్ రైస్ విషయంలో అయితే 15 శాతం నూకలతో 68 శాతం బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నిబంధనల ప్రకారం కొంత ఇబ్బందికి అవకాశం ఉన్నా.. కిందామీద పడి రైస్ మిల్లర్లు నిబంధనల ప్రకారమే బియ్యం ఇస్తూ వస్తున్నారు. అయితే తాజాగా (రబీ)లో మరో 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేలా కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఒప్పించారు. అందుకు అనుగుణంగానే సాధారణంగా ఉండే కోటాకు అదనంగా మరో 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసి తీసుకునేందుకు కేంద్రం (ఎఫ్‌సీఐ) అంగీకరించారు. హమ్మయ్య అని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కానీ.. అక్కడే అసలు తకరారు మొదలయ్యింది. అదనంగా తీసుకునే 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం విషయంలో ఒక క్వింటాలు ధాన్యానికి ఇవ్వాల్సిన బియ్యం విషయంలో కేంద్రం పాత పద్ధతిని పక్కన పెట్టి కొత్త మార్గదర్శకాలను, నిబంధనలను రూపొందించి.. వాటి ప్రకారమే బియ్యం ఇవ్వాలంటూ హుకుం జారీచేసింది.దీనిని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లకు పురమాయించింది. రా రైస్ విషయంలో 10 శాతం నూకలతో.. 67 శాతం బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే బాయిల్డ్ రైస్ విషయంలో 5 శాతం నూకలతో 68 శాతం బియ్యాన్ని ఇవ్వాలని కేంద్రం నిబంధనలను రూపొందించింది.నిజానికి పాత పద్ధతిలో రారైస్ అయితే 25 శాతం బ్రోకెన్, బాయిల్డ్ రైస్ అయితే 15 శాతం బ్రోకెన్‌తో బియ్యం ఇవ్వడానికి రైస్ మిల్లర్లకు కాస్త ఇబ్బంది అయినా.. పాటిస్తూ వస్తున్నారు. అయితే అదనంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం విషయంలో ఈ నిబంధనలను పూర్తిగా మార్చివేసి రా రైస్ అయితే 10 శాతం నూకతో.. బాయిల్డ్ రైస్ అయితే 5 శాతం నూకతో ఇవ్వాలని కేంద్రం విధించిన నిబంధనలను పేర్కొంటూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో రాష్ట్రంలోని రైస్ మిల్లర్ల పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్టయ్యింది.వాస్తవంగా ఉష్ణోగ్రతల ప్రభావాన్ని పరిగణలోకి తీసుకోకుండా సిద్ధంచేసిన నిబంధనలు పాటించడం ఈ రబీలో కష్టమని మిల్లర్లు తేల్చి చెబుతున్నారు. సాధారణంగా 36 డిగ్రీల ఉష్ణోగ్రత వరకు రా రైస్ అయితే 25 శాతం నూకతో 67 శాతం బియ్యాన్ని.. బాయిల్డ్ రైస్ అయితే 15 శాతం నూకతో 68 శాతం బియ్యాన్ని ఇవ్వవచ్చు. కానీ.. ప్రస్తుతం రాష్ట్రంలో 43 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు భగ్గుమంటున్నాయి. ఈ వేసవిలో 46 డిగ్రీలకుపైగా కూడా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోందికూడా. ఈ నేపథ్యంలో అత్యధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు ధాన్యం మిల్లింగ్ చేస్తే.. 25 శాతానికి మించి నూకలు వస్తాయని.. అప్పుడు 67 శాతం రైస్, 68 శాతం బాయిల్డ్ రైస్ రావు. మరి ప్రభుత్వానికి బియ్యాన్ని ఎలా ఇవ్వాలని మిల్లర్లు అడుగుతున్నారు. అందుకే తాము పీకల్లోతు నష్టాల్లో ముంచే అవకాశం ఉన్న ఈ నిబంధనల ప్రకారం బియ్యాన్ని ఇవ్వలేమని కరాకండిగా చెబుతూ.. జిల్లాల వారీగా, రాష్ట్ర స్థాయిలోనూ అధికారులకు విజ్ఞాపన పత్రాలు అందిస్తున్నారు.ఇదిలా ఉండగా, కేంద్రం నుంచి వచ్చిన 10 శాతం నూకతో 67 శాతం రా రైస్ బియ్యం ఇవ్వాలనే నిబంధనను యధాతథంగా అమలుచేస్తూ, అదనంగా వచ్చే నూకలను అలాగే మిల్లర్ల వద్ద నిల్వ చేసుకోవాలని, కేంద్రం నుంచి (ఎఫ్‌సీఐ) వచ్చే తదుపరి ఉత్తర్వుల ప్రకారం ఆ నూకలను ఏం చేయాలనేది నిర్ణయిస్తామని పౌర సరఫరాల శాఖ నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాయి. ఇక్కడే మిల్లర్లు మరోసారి తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు.అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా 25 శాతానికి మించి నూకలు వచ్చే నేపథ్యంలో.. 10 శాతం నూకలతో 67 శాతం రారైస్‌ను, అలాగే 5 శాతం నూకలతో 68 శాతం బాయిల్డ్ రైస్‌ను ఇవ్వడం ఎలా సాధ్యమంటూ మిల్లర్లు గగ్గోలు పెడుతున్నారు. వాస్తవ వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే.. రా రైస్ అయితే 25 శాతానికిపైగా, బాయిల్డ్ రైస్ అయితే 15 శాతానికిపైగా నూకలతో ఇవ్వాలనే నిబంధనలు ఉండాలని..కానీ అందుకు విరుద్ధంగా 10 శాతం, 5 శాతం నూకలతో ఇవ్వాలని ఆదేశించడం.. పైగా అదే ఉత్తర్వుల్లో.. మిగిలిన15 శాతం నూకలను రైస్ మిల్లర్ల వద్దే నిల్వ చేయాలని చెప్పడంపై లబోదిబోమంటున్నారు. అంటే ఒకపక్క 25 శాతం నూకలు రావడం సహజమని ఒప్పుకుంటూనే.. 10 శాతం నూకలతో బియ్యాన్ని సెంట్రల్ పూల్ కింద ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)కి ఇవ్వాలని చెప్పడంతో నోరెళ్ళబెడుతున్నారు.కేంద్రం రూపొందించిన నిబంధనలను ఒప్పుకుని బియ్యం ఇవ్వాలంటే (10 శాతం, 5 శాతం నూకలతో) అక్రమాలు చే యాల్సిందేనంటూ రైస్ మిల్లర్లు వాపోతున్నారు. నిబంధనల పేరుతో మిల్లర్లను అక్ర మాలు చేసుకునేలా మళ్ళిస్తున్నారా అం టూ మండిపడుతున్నారు. పైగా 25 శాతం నూకలు వస్తాయని చెబుతూనే, 10 శాతం నూకలతో ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరా చేయాలని.. మిగిలిన 15 శాతం నూకలను ఏం చేయాలనేది తరువాత నిర్ణయం తీసుకుంటాం.. అప్పటి వరకు మీరే భద్రప ర్చాలని చెప్పడంతో.. వాటిని సంరక్షించలేక.. ఇటు ఇవ్వాల్సినంత బియ్యాన్ని ఇవ్వ లేక.. అక్రమాలకు పాల్పడటమో.. లేక ఆస్తులను అమ్ముకోవడం తప్పితే గత్యంతరం లేదని మిల్లర్లు వాపోతున్నారు.ఈ నూకల కయ్యం కారణంగానే.. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా వేగంగా కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్ళకు అనుగుణంగా రవాణా వేగంగా సాగడం లేదు. ఈ నిబంధనల ప్రకారం తాము బియ్యం ఇవ్వలేమని, అందుకే తాము ధాన్యం తీసుకోమంటూ రైస్ మిల్లర్లు భీష్మించారు. బలవంతంగా లారీల్లో ధాన్యాన్ని పంపిస్తున్నప్పటికీ.. దింపుకోకుండా మిల్లర్లు వెనక్కి పంపించడమో.. లేక వెయిటింగ్‌లో పెట్టడమో చేస్తున్నట్టుగా సమాచారం రాష్ట్ర వ్యాప్తంగా లారీల కొరత, పేరుకు పోయిన ధాన్యం.. కొనుగోళ్లలో స్థంభన.. వెరసి రైతన్నలు రోడ్లపైకి వస్తున్నట్టుగా అధికారులుకూడా అంచనావేస్తున్నారు. మొత్తానికి కేంద్రం రూపొందించిన 'నూకల' శాతం కాస్తా.. ప్రభుత్వం, రైస్ మిల్లర్ల మధ్యన యుద్ధంగా మారడంతో.. ఆ ప్రభావం రాష్ట్ర రైతాంగానికి చుట్టుకుంది.అటు ప్రభుత్వం, ఇటు రైతులు.. మరోవంక రైస్ మిల్లర్ల మధ్యన ట్రయాంగిల్ వార్‌లా మారింది. దీనిపై ప్రభుత్వమే చొరవ తీసుకుని ఉష్ణోగ్రతను దృష్టిలో పెట్టుకుని నిబంధనలు మార్చితే.. ధాన్యాన్ని తీసుకోవడానికి సిద్ధమంటూ రైస్ మిల్లర్లు చెబుతున్నారు. మరి ప్రభుత్వం ఏం చేస్తుందో చూడాలి..!

## ట్రోల్స్ కే సోషల్ మీడియా పరిమితమా...



హైదరాబాద్,: తెలంగాణ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ పార్టీకి బలమైన మీడియా ఉంది. ఒకవైపు ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు ప్రింట్ మీడియా కూడా సొంతంగా ఏర్పాటు చేసుకుంది. అయితే.. 2023 ఎన్నికల్లో ఈ మీడియా పార్టీని గట్టెంక్కించలేక పోయింది. అంతేకాదు.. గ్రామీణ ఓటరు నాడిని కూడా పట్టుకోలేక పోయింది. ఫలితం గా నగరాల్లో కొంత మేరకు ఫర్వాలేదని అనిపించినా.. గ్రామీణ స్థాయిలో పార్టీ పరాజయం పాలైంది. ఇక, వచ్చే ఎన్నికలకు సంబంధించి పార్టీ ఇప్పటి నుంచే కసరత్తు ముమ్మరం చేస్తోంది. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను బలోపేతం చేయడంతోపాటు.. నాయకులను కూడా ముందుండి నడిపించాలని ఇటీవలే సీనియర్ నాయకులకు పార్టీ సుప్రీం కేసీఆర్ తేల్చి చెప్పారు. ఇదే సమయంలో సోషల్ మీడియా ప్రస్తావన కూడా వచ్చింది. ప్రస్తుతం సోషల్ మీడియా చాలా యాక్టివ్‌గా ఉందని కేటీఆర్ చెప్పగా.. అదేం లేదని.. హరీష్ రావు వ్యాఖ్యానించినట్టు తెలిసింది. సోషల్ మీడియా కేవలం ట్రోల్స్, విమర్శలకే పరిమితం అవుతోందన్నది హరీష్ రావు వాదనగా ఉంది. అలా కాకుండా.. క్షేత్రస్థాయిలో ప్రజల నాడిని.. పట్టుకునే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందని హరీష్ రావు అభిప్రాయపడ్డారు. దీనిపై ఒకరిద్దరు నాయకులు.. ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. గ్రామీణ, పట్టణ స్థాయిలో ప్రజల నాడిని పట్టుకునే విషయంలో బీఆర్ ఎస్ సోషల్ మీడియా పెద్దగా వర్కవుట్ చేయడం లేదన్న వాదన వినిపించింది. ప్రస్తుతం రాజకీయంగా విమర్శలకు.. పోస్టులకు మాత్రమే పరిమితం అవుతోందన్నది ఎక్కువ మందిలో ఉన్న అభిప్రాయం. ఇది ఓటరు నాడిని పట్టుకునే ప్రయత్నం చేయడం లేదని కూడా చెబుతున్నారు. వాస్తవానికి ప్రధాన మీడియాతో పోల్చుకుంటే సోషల్ మీడియాకు రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇస్తుంటాయి. ఈ విషయంలో బీఆర్ ఎస్ కూడా భారీ వింగ్‌ను ఏర్పాటు చేసుకుంది. ఈ నేపథ్యంలోనే సోషల్ మీడియా ప్రస్తుతం రాజకీయ విమర్శలకు.. పోస్టులకు పరిమితం అయిందని.. ప్రజల నాడిని ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురాలేక పోతోందన్న అభిప్రాయం వచ్చింది. దీనిని బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు.

## పినపాక పట్టీనగర్‌లో వడదెబ్బకు వ్యక్తి మృతి

బూర్గంపహాడ్: వడదెబ్బ తగలడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన బూర్గంపహాడ్ మండల పరిధి పినపాక పట్టీనగర్ గ్రామం లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పినపాక పట్టీనగర్ గ్రామానికి చెందిన భూక్యా వెంగళరావు (50) ఇంటి వద్ద మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉన్నప్పటికీ నిర్మాణ పనులు చేస్తూ అలసిపోయాడు. ఎప్పటి మాదిరిగానే భోజనం చేశాక ఇంట్లో నిద్రించాడు. అయితే ఉదయం నిద్రలేవకపోవడంతో వడదెబ్బ కారణంగా మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు భావించారు. వెంగళరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



# బర్డ్ ఫ్లూ పై ఆందోళన వద్దు.!




రాయచోటి,: బర్డ్ ఫ్లూ పై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం అన్నమయ్య జిల్లాలోని పుంగనూరు ,మదనపల్లె జిల్లాలోని బర్డ్ ఫ్లూ సోకిన పలు కోళ్ల ఫారాలను పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు .కోళ్ల ఫారం యజమానులతో జిల్లా కలెక్టర్ వారి కష్టాలను బర్డ్ ఫ్లూ పై తీసుకుంటున్న చర్యలను ఈ బర్డ్ ఫ్లూ భవిష్యత్తులో రాకుండా పూర్తిస్థాయిలో నివారించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలో విపులంగా చర్చించారు .అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూబర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తా మనీ హామీ ఇచ్చారు.అంతేకాకుండా మదనపల్లెలోబర్డ్ ఫ్లూ పై కంట్రోల్ రూమ్ ఏర్పాటు. చేశామని చెప్పారు.కోళ్ల నుండి మనుషులకు బర్డ్ ఫ్లూ సోకే అవకాశాలు దాదాపు శూన్య మనీ వివరించారు100 డిగ్రీలకు పైగా వేడి చేసిన మాంసంలో బర్డ్ ఫ్లూ వైరస్ ఉండదనితెలిపారు.అన్నమయ్య జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గంలోని సదుం మండలంలోని రెండు కోళ్ల ఫారాలలో గుర్తించిన బర్డ్ ఫ్లూ పై ప్రజలు ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, బర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదుం మండలంలోని పుత్తవారిపల్లె, అమ్మగారి పల్లె గ్రామాలలోని రెండు కోళ్ల ఫారాలలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిన నేపథ్యంలో కోళ్లను ఖననం చేయడానికి జిల్లా కలెక్టర్ పశుసంవర్ధక శాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.సదుం మండలంలో గుర్తించిన బర్డ్ ఫ్లూ పై చర్యలు తీసుకునేందుకు పశు సంవర్ధక శాఖకు తగిన ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖల సమన్వయంతో.సదుం మండలం నుండి ఇతర ప్రాంతాలకు కోళ్ల సరఫరా జరగకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ప్రజలు ఎవరు బర్డ్ ఫ్లూ పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. బర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సదుం మండలం మినహా మిగతా ఏ మండలాలలో అసాధారణ కోళ్ళ మరణాలు సంభవించలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ మాట్లాడుతూ.అన్నమయ్య జిల్లా సదుం మండలం పుత్తవారిపల్లె, అమ్మగారి పల్లె, కంభం వారి పల్లె, గ్రామాలకు చెందిన ముగ్గురు రైతుల కోళ్ల ఫారాలలో అనూహ్యమైన సంఖ్యలో కోళ్ల మరణాలు సంభవించగా అప్రమత్తమైన పశుసంవర్ధక శాఖ మొదటి రెండు కోళ్ల ఫారాల నుండి చనిపోయిన కోళ్ల శాంపుల్స్ ను మధ్యప్రదేశ్ భోపాల్ లోని హై సెక్యూరిటీ ల్యాబ్ కు పంపగా చనిపోయిన కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్లుగా నిర్ధారణ అయిందని పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో... పుత్తవారిపల్లె మరియు అమ్మగారి పల్లె గ్రామాలలోని రెండు కోళ్ల ఫారాల లోని కోళ్లను స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ద్వారా బ్లీచింగ్ పౌడర్ సున్నం లను ఉపయోగించి కోళ్లను ఖననం చేసినట్లుగా పేర్కొన్నారు. కంభం వారి పల్లె గ్రామంలోని కోళ్ల ఫారానికి చెందిన కోళ్ల శాంపిల్స్ యొక్క నివేదిక భోపాల్ నుండి రావాల్సి ఉందని నివేదిక వచ్చిన వెంటనే దానిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ మరియు అన్నమయ్య జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బర్డ్ ఫ్లూ పై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఆటోల ద్వారా టామ్ టామ్ వేయిస్తున్నామని పేర్కొన్నారు. కోళ్ల నుండి మనుషులకు బర్డ్ ఫ్లూ సోకే అవకాశాలు చాలా చాలా తక్కువ అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నూరు డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతతో వేడి చేసిన చికెన్ ను తినడం వల్ల ఎటువంటి సమస్య ఉండదని ప్రజలు ఈ విషయంలో భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అమ్మగారిపల్లె పుత్తవారిపల్లె గ్రామాలలో కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేశామని, ప్రజలు ఎవరైనా కోళ్లలో అసాధారణ మరణాలు సంభవించడం గమనిస్తే వెంటనే 7013914401, (అమ్మవారి పల్లి), 9398262752, (పుత్తవారిపల్లె) నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలపవచ్చని పేర్కొన్నారు.

## హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు

# భూసేకరణ అడుగులు



హైదరాబాద్ : హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనులపై కీలక అప్డేట్ వచ్చింది. ఈ భాగానికి త్వరలో టెండర్లు పడనుండగా.. 1,895 హెక్టార్ల భూసేకరణ జరగాల్సి ఉంది. వీటితో పాటు.. ఆర్మూర్-మంచిర్యాల, మహబూబ్‌నగర్ మార్గాల్లో 1,372 హెక్టార్లకు గానూ కేవలం 255 హెక్టార్లే పూర్తయ్యాయి. భూసేకరణ ప్రక్రియ వేగవంతమైతేనే ఎన్‌హెచ్ఏఐ పనులు పట్టాలెక్కనున్నాయి.తెలంగాణ గేమ్ ఛేంజర్‌గా హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని మౌలిక సదుపాయాల కల్పనలో అత్యంత కీలకమైన ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలవాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ భావిస్తోంది. ఆర్ఆర్ఆర్‌తో పాటు పలు జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణే ప్రధాన అడ్డంకిగా మారింది.హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనులు ప్రారంభించేందుకు ఎన్‌హెచ్ఏఐ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 1,895 హెక్టార్ల భూమి అవసరం. కాగా ఇప్పటికే 1,862 హెక్టార్లకు సంబంధించి 3డీ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. భూసేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకోవడంతో.. మరోసారి టెండర్లను ఆహ్వానించేందుకు అధికారులు రెడీ అవుతున్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే నగరం చుట్టూ రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి.రాష్ట్రంలో కేవలం రీజినల్ రింగు రోడ్డే కాకుండా, మరిన్ని కీలక జాతీయ రహదారుల పనులు కూడా భూసేకరణ గండం దాటాల్సి ఉంది. ఆర్మూర్ నుండి మంచిర్యాల వరకు, మహబూబ్‌నగర్ పరిధిలో పనులు ప్రారంభం కావాల్సి ఉంది. జగిత్యాల- మంచిర్యాల, మహబూబ్‌నగర్- గూడెబల్లూర్, ఆర్మూర్- జగిత్యాల, జగిత్యాల- కరీంనగర్ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నాలుగు రహదారుల కోసం మొత్తం 1,372 హెక్టార్ల భూమి అవసరం. ఇప్పటి వరకు కేవలం 255 హెక్టార్లు మాత్రమే సేకరించారు. మిగిలిన భూసేకరణ వివిధ దశల్లో పెండింగ్‌లో ఉండటం ప్రాజెక్టుల నిర్మాణం ఆటంకంగా మారింది.జగిత్యాల-కరీంనగర్ రహదారి విస్తరణకు సంబంధించి రైల్వే శాఖ నుంచి రావాల్సిన అనుమతులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. మరోవైపు, ఈ రహదారుల పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తి అయింది. పనుల పర్యవేక్షణ కోసం త్వరలోనే కన్సల్టెన్సీ సంస్థలను ఎంపిక చేయాలని ఎన్‌హెచ్ఏఐ డిసైడ్ అయింది. భూసేకరణ కొలిక్కి వస్తేనే కన్సల్టెన్సీల నియామకం, క్షేత్రస్థాయి పనులకు అడ్డంకులు తొలిగిపోతాయని అధికారులు చెబుతున్నారు.ఈ ప్రాజెక్టుల కోసం భారీ నిధులను కేటాయించినప్పటికీ..

రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను ఎంత వేగంగా పూర్తి చేస్తుందనే దానిపైనే వీటి భవితవ్యం ఆధారపడి ఉందని నిపుణులు చెబుతున్నారు. భూసేకరణ పూర్తయి, క్లియరెన్స్ లభిస్తేనే కాంట్రాక్టర్లు పనులు మొదలుపెట్టే అవకాశం ఉంటుందన్నారు. ఆర్ఆర్ఆర్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే తెలంగాణ ఆర్థిక ముఖచిత్రం మారడమే కాకుండా.. జిల్లాల మధ్య కనెక్టివిటీ కూడా పెరుగుతుందని అంటున్నారు.

# యాప్‌లపై టెక్ నిపుణులేమంటున్నారంటే..?!



దేశ భద్రత పేరుతో పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు కేంద్ర ప్రభుత్వం భంగం కలిగిస్తోందా?! ఎందుకంటే పార్లమెంటు సమావేశాల సందర్భంగా మోడీ సర్కార్ సంచార్ సాథీ యాప్‌ను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించింది. అయితే ప్రతిపక్షాల నిరసనలతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్టు ప్రకటించింది. ఇదే కాదు.. నవంబర్ 24 కేంద్రం డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డిపిడిపి) చట్టం 2023లో నోటిఫై చేసిన నిబంధనలు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఉన్నాయని జర్నలిస్టు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల కాలంలో కేంద్రం అమలు చేయాలనుకున్న ఈ విధానాలు పూర్తిగా సమాచారానికి సంబంధించినవే కావడం గమనార్హం. కేంద్రం తేవాలని ప్రయత్నించిన సంచార్ సాథీ యాప్ ద్వారా పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు ముప్పు వాటిల్లుతుందనేది బహిరంగ సత్యం. అయితే దీనిపై కేంద్రం చెబుతున్న మాటలు మరోలా ఉన్నాయి. పొరపాటున పోగట్టుకున్న లేదా దొంగిలించిన స్మార్ట్‌ఫోన్‌లను బ్లాక్ చేయడానికి, వాటిని ట్రాక్ చేయడానికి ఈ సంచార్ సాథీ యాప్ ఉపయోగపడుతుందని.. అందుకే ఈ యాప్‌ని తేవడానికి ప్రయత్నించినట్లు కేంద్రం చెప్పింది. అయితే అసలు ఈ యాప్‌పై టెక్ నిపుణులు ఏమంటున్నారంటే.. ప్రస్తుత కాలంలో స్మార్ట్‌ఫోన్లు ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైపోయాయి. ఇవి వ్యక్తిగత విషయాలను చాలా గోప్యంగా ఉంచుతాయి. అందుకే..స్నేహితులకు, కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు చెప్పుకోలేని సమాచారాన్ని కూడా ఇవి భద్రంగా ఉంచుతాయి. అసలు చాలామంది వినియోగదారులకు తమ ఫోన్లలో ఇలాంటి యాప్ ఒకటి ఉందని వారికి తెలియకపోవచ్చు. కొద్దిమంది మాత్రమే ఫోన్లలో ఈ యాప్ గురించి శోధించి.. తొలగించడానికి ప్రయత్నిస్తారు. ఈ యాప్ వల్ల జరిగే ప్రయోజనం కంటే.. వినియోగదారులకు నష్టమే ఎక్కువ జరుగుతుంది. ఈ యాప్ ద్వారా వ్యక్తిగత డేటాను సులభంగా పొందవచ్చు. కాల్ లాగ్‌లు, పరిచయాలు, మీరు ఎక్కడున్నది? మీ చరిత్ర, మీరు మాత్రమే గోప్యంగా ఉంచుకునే సమాచారాన్ని కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మీరు పంపే సందేశాల్ని ఈ యాప్ ద్వారా సేకరించ వచ్చు. అలాగే ఈ యాప్ వినియోగదారుల హక్కుల్ని కూడా దెబ్బతీ స్తుంది. ఇది ఫోన్ పనితీరుపై కూడా ప్రభావితం చేస్తుంది. అందుకే స్మార్ట్‌ఫోన్లను రక్షించడానికని చేసే ప్రయత్నం.. మెరుగైన పద్ధతుల్లో ఉండాలి. ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ వ్యవస్థను బలోపేతం చేయవచ్చు. తప్పనిసరి అని భావిస్తే.. యాప్‌కు కోడ్ తప్పనిసరి అని అభిప్రాయపడ్డారు.

# టీడీపీ గూటికి సిద్ధా..!



ఒంగోలు, : వైయస్సార్ కాంగ్రెస్(పార్టీకి గుడ్ బై చెప్పారు ఒక మాజీ మంత్రి. అయితే ఏడాది కిందట ఆయన రాజీనామా చేశారు. కానీ ఇంతవరకు ఏ పార్టీలో చేరలేదు. ఇష్టమైన పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదు. మరో పార్టీలో చేరే ఉద్దేశం లేదు. దీంతో గత ఏడాదికాలంగా ఆయన భగీరథ ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అయితే అధినేత చంద్రబాబును కలిశారు. కానీ లోకల్ నాయకత్వం నుంచి అభ్యంతరాలు వచ్చాయి. అయితే ఇప్పుడు స్థానిక నేతలను సముదా యించారు చంద్రబాబు. దీంతో ఆ నేతకు పార్టీలో చేర్పించేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో ఆ మాజీమంత్రి తెలుగుదేశం పార్టీలో చేరుతారని సొంత జిల్లాలో ప్రచారం జరుగుతోంది.మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామంది నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. అలానే ఆ పార్టీకి రాజీనామా చేశారు మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓడిపోయిన తరువాత రాఘవరావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గూటికి చేరారు. అలా చేరిన క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ నాయకత్వం ఆయనకు ఒక హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే దర్శి టికెట్. గతంలో అదే నియోజకవ ర్గంలో నుంచి ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. అందుకే ఆ టికెట్ తనకు ఇవ్వాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ జగన్మోహన్ రెడ్డి అందుకు అంగీకరించలేదు. మొన్నటి ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదు అయితే అయిష్టంగానే ఆ పార్టీలో కొనసాగారు రాఘవరావు. ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపోయిన వెంటనే రాజీనామా ప్రకటించారు. చంద్రబాబుతో ఉన్న తన పాత సాన్నిహిత్యాన్ని గుర్తు చేస్తూ పార్టీలోకి వస్తానని కోరారు. అయితే స్థానిక నాయకత్వం నుంచి అభ్యంతరాలు ఉండడంతో చంద్రబాబు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చంద్రబాబు తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రకాశం జిల్లాలో సీనియర్ మోస్ట్ లీడర్ సిద్దా రాఘవరావు. 1999 నుంచి ఆ పార్టీలో కొనసాగుతున్నారు. 2007లో చంద్రబాబు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. 2014లో దర్శి టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచేసరికి తన క్యాబినెట్ లోకి తీసుకున్నారు రాఘవరావును. ఐదేళ్లపాటు మంత్రి పదవిలో కొనసాగిన ఆయనను 2019 ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో ఓటమి ఎదురయ్యేసరికి రాఘవరావు వైయస్సార్ కాంగ్రెస్ ఒత్తిడికి వెనక్కి తగ్గారు. దర్శి టిక్కెట్ హామీతో ఆ పార్టీలో చేరారు. కానీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదు. పార్టీ ఓడిపోయేసరికి రాఘవరావుకు స్వేచ్ఛ లభించింది. అందుకే ఇప్పుడు మాతృ పార్టీలో చేరేందుకు చేసిన ప్రయత్నం కూడా ఫలించింది. ఒకటి రెండు రోజుల్లో ఆయన తెలుగుదేశం పార్టీలోకి రావడం ఖాయమని తెలుస్తోంది. కానీ దర్శికి ఇప్పటికే టిడిపి ఇన్చార్జిగా ఉన్నారు గొట్టిపాటి లక్ష్మి. మొన్నటి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే ఇప్పుడు రాఘవరావు వస్తుండడంతో లక్ష్మి పరిస్థితి ఏంటి అనేది తెలియడం లేదు. చంద్రబాబు ఇద్దరికీ న్యాయం చేస్తారని టిడిపి వర్గాలు చెబుతున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# మానవ వ్యర్థాలతో క్యాన్సర్ ఔషధం!



న్యూఢిల్లీ : క్యాన్సర్‌కు మానవ వ్యర్థాలతో ఔషధాన్ని కెనడా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. వీటిని 'ఫెకాల్ కాప్సూల్స్' అని, శాక్ష్మయ భాషలో ఫెకాల్‌మైక్రోబయోటా లేదా ఎఫ్‌ఎంటి అని పిలుస్తారు. ఆరోగ్యవం తుడైన మనిషి వ్యర్థాలను ఫ్రీజ్ చేసి, ఎండపెట్టి వాటిని ఎఫ్‌ఎంటి క్యాప్సూల్స్‌గా తయారు చేస్తారు. ఈగోలీలు పొట్టలోకి చేరి మంచి సూక్ష్మజీవులను పెంపొందిస్తాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ విషయంలో సాధారణంగా వాడే ఔషధాలతో పోలిస్తే ఈ ఎఫ్‌ఎంటి గోలీలు 40-45 శాతం ఎక్కువ ప్రయోజనకరంగా పనిచేస్తాయి. వీటిని సాధారణ క్యాన్సర్ ఔషధాలతో కలిపి తీసుకొంటే 80 శాతం ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. చర్మ క్యాన్సర్ విషయానికి వస్తే ఎఫ్‌ఎంటి పిల్స్‌ను సాధారణ ఔషధాలతో కలిపి తీసుకొంటే 79 శాతం అధిక ప్రయోజనం చేకూరుతుంది.

## అనంత, శ్రీ సత్యసాయి జిల్లాలకు మహర్దశ

అనంతపురం, : ఇటీవల కేంద్రం రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్‌లను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ కారిడార్లలో ఏపీకి కూడా స్థానం దక్కింది. ఈ క్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో కూడా ఖరీదైన ఖనిజాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు అక్కడ ఖనిజాల కోసం అన్వేషణ జరుగుతోంది. ప్రస్తుతం అక్కడ సర్వేతో పాటుగా పరిశోధనలు చేపట్టారు. అలాగే కడప జిల్లాలో కూడా ఖనిజాలు ఉన్నాయి.రాయలసీమను రతనాల సీమగా పిలుస్తారు.. అంతటి పేరు పొందిన ప్రాంతంలో ఇప్పటికి వజ్రాల వేట జరుగుతోంది. వర్షాకాలంలో పొలాల్లో వజ్రాలు బయటపడుతుంటాయి. అయితే రాయలసీమలో రత్నాల కంటే ఖరీదైన ఖనిజ సంపద ఉందని తెలుస్తోంది. కేంద్రం ఇటీవల ప్రకటించిన రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్‌లో ఉమ్మడి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు స్థానం దక్కింది. ఈ మేరకు అక్కడ ఖనిజాల కోసం అన్వేషణ చేయనున్నట్లు తెలుస్తోంది.అనంతపురం జిల్లాలో 2023లో హైదరాబాద్‌కు చెందిన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ పరిశోధనలు చేసింది. పలు ప్రాంతాల్లో కొన్ని ఖనిజాలు (నియోబియం, నియోడైమియం, సిరియం, లాంథనం, ప్రాసోడైమియం,స్కాండియం, జిక్రోనియం, లిథియం) ఉన్నట్లు గుర్తించారట. ఈ ఖనిజాలను ఎయిర్‌క్రాఫ్ట్, స్మార్ట్‌ఫోన్లు, విండ్ టర్బైన్స్, కంప్యూటర్లు వంటి వాటిలో కూడా ఉపయోగిస్తారని చెబుతున్నారు.

# ప్రాణాల మీదకు డిజిటల్ వ్యసనం!

ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ముగ్గురు టీనేజ్ సిస్టర్స్ ప్రాణాలు తీసుకోవడం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇది టీనేజర్ల ఇంటర్నెట్ వాడకంపై, ముఖ్యంగా నియంత్రణ లేని ప్రపంచంపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. చిన్న పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేందుకు వయో పరిమితులు విధించే విషయంలో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వయసు ఆధారంగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగానికి అనుమతి ఇచ్చే విషయంలో ఇటీవల ఆర్థిక సర్వే పలు సూచనలు చేసిందని, ఆ సర్వే అభిప్రాయాలన్నింటిని ప్రభుత్వం పరిశీలిస్తోందని కేంద్ర ఐటీ కార్యదర్శి ఎస్ కృష్ణన్ చెప్పారు. వయసు పరిమితి విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఇంటర్నెట్ కార్పొరేషన్ ఫర్ అసైన్డ్ నేమ్స్ అండ్ నంబర్స్ (ఐసీఏఎన్ఎన్) సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పిల్లలు ఇంటర్నెట్‌ను వినియోగించే విషయంలో ఆస్ట్రేలియా తరహా చర్యలు తీసుకుంటారా? అన్న ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు వయసు నిబంధనలతో పాటు డిజిటల్ వ్యసనాన్ని తగ్గించడానికి ఆన్‌లైన్ టీచింగ్‌ను కూడా తగ్గించాలని ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే సూచించింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు తప్పనిసరిగా వయసు ధ్రువీకరణను చేయాలని, డిజిటల్ వ్యసనానికి దూరంగా ఉంచేందుకు వీలుగా పిల్లలకు విద్యా విషయాలను అందించే సులువైన పరికరాలను ప్రోత్సహించాలని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. హానికరమైన కంటెంట్‌కు పిల్లలు ప్రభావితమవుతారని, వయసు ధ్రువీకరణ బాధ్యతను ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లే వహించాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. ఈ సర్వే విడుదల సందర్భంగా చీఫ్ ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ మాట్లాడుతూ, ఇంటర్నెట్ వినియోగానికి వయసు నిబంధనలు తెచ్చే ఆలోచనలో ఆంధ్రప్రదేశ్, గోవా ప్రభుత్వాలు ఉన్నట్లు తమకు తెలిసిందన్నారు. ఇటీవల ఘజియాబాద్‌లో ముగ్గురు బాలికలు ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం, కొరియా కల్చర్ మోజుపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఆన్‌లైన్ కంటెంట్‌కు పిల్లలను దూరంగా ఉంచాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.వయసులో పెద్ద, జాబ్ స్ట్రెస్ వల్ల ఇలా చేసుకున్నారా అంటే కాదు. నిషికా (16), ప్రాచి (14), పాఖీ (12). కనీసం యుక్తవయసుకు కూడా రాకముం దే.. బుధవారం తెల్లవారు జామున వారి ఉంటున్న తొమ్మిదవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. దీనికి కారణం ఏంటంటే..ఈ అమ్మాయిలు ఆన్‌లైన్ గేమ్స్‌కు, కొరియన్ పాప్ కల్చర్‌కు ప్రభావితమయ్యారని.. దాంతోవారి తండ్రిమొబైల్ ఫోన్లనుఎక్కువగా వాడటంపై అభ్యంతరం వ్యక్తం చేశారని మీడియా నివేదికలు చెప్తున్నాయి. పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తుండగా.. మైనర్ల స్క్రీన్ సమయం, డిజిటల్ యుగంలో తల్లిదండ్రుల పర్యవేక్షణ పాత్రపై విస్తృత చర్చ మళ్లీ మొదలైంది.మానసిక ఆరోగ్య నిపుణులు ప్రకారం.. కౌమారదశ అనేది చాలా సున్నితమైన దశ. కాబట్టి వారి డిజిటల్ అలవాట్లను తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించడం చాలా అవసరమని నొక్కి చెబుతున్నారు. ఆర్టిమిస్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌లో సీనియర్ కన్సల్టెం ట్, సైకియాట్రీ హెడ్ డాక్టర్ రాహుల్ చందోక్ ఏమి చెప్పారంటే.. కోవిడ్-19 మహమ్మారి కారణంగా ఘజియాబాద్ సోదరీమణులు పాఠశాలకు వెళ్లలేదనే నివేదికలను ప్రస్తావించారు.

"పిల్లలకు సాధారణ కార్యకలాపాలు లేనప్పుడు.. ఆన్‌లైన్, మొబైల్ గేమ్‌ల ఉచ్చులో పడటం చాలా సులభం అవుతుంది" అని డాక్టర్ చందోక్ ఃఖతో తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు తరచుగా భావోద్వేగాలకు ఒక మార్గంగా మారుతాయని అన్నారు. గురుగ్రామ్‌లోని సెంటర్ ఫర్ మెంటల్ హెల్త్‌లో చైల్డ్ అండ్ అడోలెసెంట్ సైకియాట్రిస్ట్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రమిత్ రస్తోగి మాట్లాడుతూ.. మితంగా ఫోన్ వాడటం వల్ల పిల్లలు తమ స్నేహితులతో రిలేషన్స్ కొనసాగించగలుగుతారని అన్నారు. 6 నుంచి 12 సంవత్సరాల వయస్సు గల పిల్లలు నైపుణ్యాన్ని పెంపొందించుకోవ డంపై దృష్టి పెడతారు. అయితే 13, 18 సంవత్సరాల మధ్య గుర్తింపు ఏర్పడే దశ.. ఇది పరస్పర భావోద్వేగాలను కోరుకుంటుందని వివరించారు.' 'గుర్తింపు సరిగ్గా రాకపోయినా, చేసిన పనికి తగిన అప్రిసియేషన్ లేకపోయినా.. అది టీనేజర్లను బలహీనపరుస్తుంది" అని రస్తోగి అన్నారు. ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం గురించి మాట్లాడు తూ.. "ఆటోమేటిక్"గా అనిపించే అనుభవాలు.. తక్కువ ఎఫర్ట్స్‌తో తక్షణమే వచ్చే గుర్తింపుసంతృప్తిని అందిస్తాయని పేర్కొన్నారు.ము గ్గురు సోదరీమణులు సామాజికంగా దూరంగా ఉన్నారని వచ్చిన నివేదికలను ప్రస్తావిస్తూ.. ఒంటరితనం తరచుగా టీనేజర్లను జీవితా నికి దూరం చేస్తుందని అన్నారు. "ఒక టీనేజర్ సమాజానికి ఎంత దూరంగా ఉంటే.. జీవితానికి రంగులు తెచ్చే విషయాలకు అంతగా దూరమవుతారు, స్క్రీన్‌కి దగ్గర అవుతారని" అని ఆయన అన్నారు. ఒంటరిగా, స్నేహితులకు దూరంగా లేదా తల్లిదండ్రుల శ్రద్ధకు దూరంగా ఉన్న పిల్లలు దీనికి ఎక్కువ గురవుతారని చందోక్ అభిప్రా యపడ్డారు. అలా పిల్లలు ఆన్‌లైన్ గేమ్స్, ఇతర వ్యాపకాలపై ఎక్కువ దృష్టి సారిస్తారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సమయం కేటాయించాలని సూచిస్తున్నారు నిపుణులు. వారి సేఫ్టీగా కోసం మొబైల్ ఇవ్వాలనుకుంటే అది కరెక్ట్ కాదని.. మొబైల్ అవసరం లేని పరిస్థితిని ఇంటా, బయట క్రియేట్ చేయాలని చెప్తున్నారు. పాఠశాలకు వెళ్తూ, బయట ఫ్రెండ్?షిప్ చేస్తూ, పరీక్షలు రాసే, సాధారణ కార్యకలాపాల్లో పాల్గొనే పిల్లలు నార్మల్?గా ఉంటారని గుర్తించాలని రస్తోగి తల్లిదండ్రులకు సూచించారు. అలాగే తల్లిదండ్రుల పెంపకం కూడా పరిస్థితులకు అనుగుణంగా మారవలసి ఉంటుందని.. తెలిపారు. అన్ని విషయాల్లో కఠినంగా ఉండనవసరం లేదని.. కొన్ని విషయాల్లో వారికి ఫ్రీ హ్యాండ్ ఇవ్వాలని.. అలా అని పూర్తిగా వదిలేయకూడదని చెప్తున్నారు.


## కలిపి తీసుకుంటే కష్టమే!



మాంసాహారం, పాలు ఒకేసారి తీసుకోవద్దని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఆయుర్వేదం ప్రకారం మాంసాహారం-పాలను 'విరుద్ధ ఆహారం'గా పిలుస్తారట. అందుకే, ఈ రెండిటినీ కలిపి తీసుకుంటే లేనిపోని ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తు న్నారు. ఇందుకు కారణాలు చెబుతూ.. మాంసం వేడిచేసే గుణాన్ని కలిగి ఉంటుంది. పాలు చలువ చేస్తాయి. కాబట్టి, ఈ రెండూ కలిపి తీసుకున్నప్పుడు జీర్ణ ప్రక్రియలో అసమతుల్యత ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా.. పాలు, మాంసంలో ప్రొటీన్స్, పోషకాలు రెండూ అధిక మొత్తంలో ఉంటాయి. కాబట్టి, ఈ రెండిటినీ కలిపి తీసుకోవడం వల్ల.. జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపుతుందట. కడుపు ఉబ్బరం, అజీర్ణం, కడుపు నొప్పి, వికారం లాంటి సమస్యలు ఎదురవుతాయని అంటున్నారు. కొందరిలో గుండెల్లో మంట కూడా వస్తుందట. కాబట్టి, మాంసాహారం తిన్న తర్వాత కనీసం 2నుంచి 3 గంటల విరామం ఇచ్చిన తర్వాతే పాలు తాగడం మంచిదని సలహా ఇస్తున్నారు. ఇక చేపలు తిన్న తర్వాత పాలుతాగితే.. తీవ్రమైన అలర్జీలు వచ్చేఅవకాశంఉందని అంటున్నారు.


# నెలల శిశువుకు కడుపునొప్పి వస్తుందా?

మా పాపకు రెండున్నర నెలలు. చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఐదున్నర కిలోల బరువు ఉంది. తల్లి పాలే పడుతున్నాం. పాప మల విసర్జన సరిగా లేదు. పోయిన వారంలో నాలుగు రోజుల తర్వాత విరేచనం అయింది. అయిదు రోజులు గడిచినా ఈ వారంలో ఇంకా విరేచనం కాలేదు. పిల్లల డాక్టర్‌కి చూపిస్తే.. కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. రెండు రకాల ఓరల్ డ్రాప్స్ (చుక్కల మందు) ఇచ్చారు. పాలు ఎక్కువగా తాగకుండా చూసుకోమని సలహా ఇచ్చారు. ఆ మందులు వాడిన మరుసటి రోజు కూడా మోషన్ కాలేదు. అప్పుడప్పుడూ ఏడుస్తున్నది. కడుపు నొప్పితో ఏడుస్తుందేమోనని అనుకుంటున్నాం. అడపాదడపా పాలు తాగిన తర్వాత వాంతి చేసుకుంటున్నది. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి? బరువు చక్కగానే ఉంది. తల్లిపాలు మాత్రమే తాగే పిల్లలు రోజూ మోషన్‌కి పోకపోతే కంగారు పడాల్సిన అవసరం లేదు. ఇలాంటి పిల్లలకు రోజుకు అయిదుసార్లు విరేచనాలు కావొచ్చు. అయిదు రోజులకు ఒకసారి విరేచనం కావొచ్చు. రెండూ సాధారణమే. కాకపోతే బిడ్డ కొద్దిగా అసౌకర్యంగా ఉన్నట్టు, ఇబ్బందిపడుతున్నట్టు చెప్పారు. అది బహుశా కడుపులో గ్యాస్ ఏర్పడడం వల్ల కలిగి ఉండొచ్చు. ఆరు నెలలలోపు శిశువులకు ఈ సమస్య కూడా సాధారణమైనదే. మీకు డాక్టర్లు ఓరల్ డ్రాప్స్ ఇచ్చారని చెప్పారు. అవి గ్యాస్ సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తాయి. అడపాదడపా వాడొచ్చు. ఇంకో ముఖ్యమైన విషయం.. తల్లిపాలు ఇచ్చిన తర్వాత భుజం మీద వేసుకుని ఓ పదిహేను, ఇరవై నిమిషాలు నిటారుగా ఉంచుకుంటే.. తేన్పులు వచ్చి రిలీఫ్‌గా ఉంటుంది.కాకపోతే తల్లి భోజనంలో మసాలాలు, కారాలు తగ్గించుకోవాలి. అలాగని పథ్యాలు చేయాల్సిన అవసరం లేదు. ఆరు నెలల్లోపు పిల్లలు పాలు తాగిన తర్వాత వాంతులు చేసుకుంటే పెరుగులా రావడం సహజం.



సాధారణంగా వాంతి అయినప్పుడు అన్నవాహిక నుంచి ఆహారం బయటపడుతుంది. కానీ ఆరు నెలల్లోపు పిల్లలకు వాంతి అయితే జీర్ణాశయానికి చేరిన పాలు తిరిగి బయటికి వస్తాయి. చిన్న వయసు శిశువుల్లో అన్న వాహికకు, జీర్ణాశయానికి మధ్యన ఉండే కండరాలు బలహీనంగా ఉంటాయి. కాబట్టి జీర్ణాశయం చేరిన పాలు తిరిగి అన్నవాహికలోకి వస్తాయి. అందుకే వాంతి అయినప్పుడు బయటపడిన పాలు పెరుగులా ఉంటాయి. ఆ వాంతులకు కంగారుపడకండి. బిడ్డ బరువు సరిగా ఉండి, హుషారుగా ఉంటే దీనికి ప్రత్యేకమైన చికిత్స అవసరమే లేదు. ఒకవేళ బిడ్డకు వాంతులు ఆకుపచ్చ రంగులో అయితే, పొట్ట అకస్మాత్తుగా ఉబ్బితే వెంటనే డాక్టర్‌కి చూపించాలి. సాధారణంగా వచ్చే పాలలాంటి, పెరుగులాంటి వాంతులకు కంగారుపడాల్సిన అవసరం లేదు. మీ బిడ్డకు గ్యాస్ వల్ల పేగుల్లో నొప్పి కలిగి ఉండి ఉంటుంది. ఇప్పటికే పిల్లల వైద్యులు చూశారు. కాబట్టి కంగారు పడకండి.

# ఈ నడక గుండెకు భరోసా




తిండి కలిగితే కండ కలదోయ్ అన్నట్టే, కొవ్వు పెరిగితే.. గుండె జబ్బు కలుగోయ్ అంటున్నారు ఫిట్‌నెస్ నిపుణులు. గుండె ఆరోగ్యానికీ, శరీరంలో కొవ్వుకీ సంబంధం ఉంది. గుండెలో ఉన్న సమస్యకు, శరీరంలో ఉన్న కొవ్వుకి ఒకటే పరిష్కారం. వ్యాయామం. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టు. గుండె ఆరోగ్యాన్ని పెంచుకునే వ్యాయామం చేస్తూ.. కొవ్వుని తగ్గించేలా కొన్ని నియమాలు పాటిస్తే డబుల్ బెనిఫిట్స్ ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అదేమిటంటే.. ట్రెడ్ మిల్ మీద కేవలం పరుగే కాక నడకనూ అలవాటు చేసుకోవాలి. రోజువారీగా ట్రెడ్ మిల్ మీద పరుగెత్తే సమయంలో పది నుంచి పన్నెండు శాతం తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. ఈ సమయాన్ని నడకకు కేటాయించాలని చెబుతున్నారు. ఆ నడక కూడా ట్రెడ్ మిల్ మీదే. నడకలోనూ వేగం ఉండాలన్నది నిబంధన. గంటకు రెండు నుంచి మూడు మైళ్ల వేగంతో ట్రెడ్ మిల్ స్పీడ్‌ని సెట్ చేసుకోవాలి. ఈ వేగంతో 30నిమిషాల నుంచి 60 నిమిషాల పాటు వాక్ చేయాలి. ఇలా వారంలో మూడుసార్లు చేస్తే శరీరంలోని కొవ్వు నిల్వలు కరిగిపోవడంతోపాటు రక్తంలోని గ్లూకోజ్ అంతా ఖర్చువుతుందట. కొత్తగా కొవ్వు పేరుకునేకి ఆస్కారమూ ఉండదు. సుదీర్ఘమైన స్పీడ్‌వాక్ గుండె వేగాన్ని మెరుగుపరుస్తుంది. రెండు సమస్యలూ ఉన్నట్లయితే.. మీ వ్యక్తిగత ఫిట్‌నెస్ ట్రైనర్ సలహా తీసుకున్న తర్వాతే ట్రెడ్ మిల్ మీద ముందడుగు వేయండి.

# పచ్చసొన వద్దనకండి!



గుడ్డులో పచ్చసొన తింటే కొలెస్ట్రాల్ పెరుగుతుందని, అది గుండెకు ప్రమాదమని భావించి చాలామంది దాన్ని పకన పెడతారు. మరీ ముఖ్యంగా జిమ్‌కు వెళ్లేవారు గుడ్డులోని తెల్లసొనను మాత్రమే తిని పచ్చసొనను పారేస్తుంటారు. కానీ పచ్చసొనతో కలిపి తింటేనే గుడ్డు సంపూర్ణ ఆహారం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. కేవలం తెల్లసొన మాత్రమే తినడం వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎకువ. తెల్లసొన ఒక ఇన్‌ఫ్లమేటరీ ప్రొటీన్. దీనికి శరీరంలో మంటను కలిగించే స్వభావం ఉంటుంది. దీన్ని పచ్చసొనతో కలిపి తిన్నప్పుడు మాత్రమే అది సమతుల్యమైన, సంపూర్ణ ఆహారంగా మారుతుంది. పచ్చసొనలో కొలెస్ట్రాల్ ఉంటుందనే కారణంతో దాన్ని అందరూ విలన్‌గా చూస్తారు. కానీ, వాస్తవానికి గుడ్డులోని మెజారిటీ పోషకాలు అందులోనే ఉంటాయి. తెల్లసొనతో పోలిస్తే పచ్చసొనలో విటమిన్ ఎ, విటమిన్ ఇ, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభిస్తాయి. మన శరీరానికి అవసరమైన కొలెస్ట్రాల్‌లో దాదాపు 85 శాతం మన కాలేయమే సొంతంగా తయారు చేస్తుంది. కేవలం 15 శాతం మాత్రమే మనం తినే ఆహారం ద్వారా అందుతుంది. శరీరం తనంతట తానుగా తయారు చేసుకునేది ఆరోగ్యానికి ఎప్పుడూ హానికరం కాదు. కణాల నిర్మాణం, హార్మోన్ల ఉత్పత్తి, మెదడు పనితీరు, రోగనిరోధక శక్తి మెరుగుపడటానికి కొలెస్ట్రాల్ ఎంతో కీలకంగా వ్యవహరిస్తుంది. ఆరోగ్యంగా ఉండాలంటే పచ్చసొనను విస్మరించకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మీరు బరువు తగ్గాలనుకున్నా, మీ కండరాలు దృఢంగా తయారవ్వాలన్నా గుడ్డును పచ్చసొనతో కలిపి పూర్తిగా తినడమే శ్రేయసరం. మార్కెట్లో దొరికే కృత్రిమ ప్రొటీన్ల కంటే ప్రకృతి సిద్ధంగా ఉత్పత్తి అయ్యే గుడ్డు ద్వారా లభించే పచ్చసొన ఎంతో మేలు చేస్తుంది.

# డిజిటల్ భద్రతే ముఖ్యం!



నేటి డిజిటల్ ప్రపంచంలో.. సోషల్ మీడియా అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగమై పోయింది. వినోదంతోపాటు కమ్యూనికేషన్, సృజనాత్మకతలోనూ ఇదే కీలకంగా మారింది. అయితే, పెద్దల వరకు సత్ఫలితాలను అందిస్తున్న సామాజిక మాధ్యమం.. పిల్లలకు లేనిపోని చిక్కులు తెచ్చిపెడుతున్నది. ఈ క్రమంలో 'డిజిటల్ భద్రత'పై పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నది. సోషల్ మీడియా వినియోగానికి '13 ఏళ్లు' అనేది చట్టపరమైన కనీస వయస్సు. అయినప్పటికీ, చాలా సందర్భాల్లో వయసు కన్నా.. అవగాహనే ముఖ్యమని పరిశీలకులు చెబుతున్నారు. దాంతోపాటు భావోద్వేగ, సామాజిక సంసిద్ధత కూడా ఉండాలని అంటున్నారు. ఇటీవలి అధ్యయనాల ప్రకారం.. మూడు నుంచి 17 ఏళ్ల పిల్లలలో 99శాతం మంది ప్రతిరోజూ ఎంతోకొంత సమయం స్క్రీన్‌పై గడుపుతున్నారట. ఇక ఆన్‌లైన్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన ప్లాట్‌ఫామ్‌గా గుర్తింపున్న యూట్యూబ్‌ను 89శాతం మంది పిల్లలు ఉపయోగిస్తున్నారట. అంతేకాకుండా.. 13 ఏళ్లకన్నా తక్కువ వయసు ఉన్న పిల్లల్లో ఎక్కువ మందికి కనీసం ఒక సోషల్ మీడియా యాప్, సైట్లో సొంత ప్రొఫైల్ ఉన్నదట. ఐదు నుంచి ఏడేళ్ల వయస్సు గల పిల్లల తల్లిదండ్రులలో.. మూడింట ఒకవంతు మంది తమ బిడ్డకు సోషల్ మీడియా ప్రొఫైల్ ఉన్నట్లు చెప్పారు. అదే ఎనిమిది నుండి 11 ఏళ్ల పిల్లలలో.. 60శాతం మంది సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నారట. దీన్నిబట్టి.. టీనేజర్లు, ప్రీ టీనేజర్లలో అధికశాతం మంది సోషల్ మీడియాను వాడుతున్నట్లు తేలింది. వీరిలో చాలామంది వినోదం కోసం,


చదువుకు సంబంధించిన విజ్ఞానాన్ని పెంచుకోవడానికే యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాలను ఆశ్రయిస్తున్నారు. అదే సమయంలో సోషల్‌మీ డియాపై అవగాహన లేమితో లేనిపోని సమస్యల్లో కూరుకుపోతు న్నారు. సైబర్ బెదిరింపులు, గోప్యత, డేటా చోరీలాంటి వాటికి గురవుతున్నారు.

భద్రత, బాధ్యతే ముఖ్యం..: పిల్లలకు ఆన్‌లైన్ భద్రతతోపాటు బాధ్యతగా వ్యవహరించడంపై అవగాహన కల్పించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆన్‌లైన్ భద్రత, ఫొటోలు, వీడియోలను పంచుకోవడంతోపాటు హానికరమైన కంటెంట్‌ను గుర్తించడంలో వారికి సహాయపడాలి. దీనివల్ల సైబర్ దాడులు, ఏఐ మార్ఫింగ్ ప్రమాదాలను పిల్లలు అర్థం చేసుకుంటారు. అప్పుడే, సురక్షితమైన ఎంపికలు చేసుకోవడానికి సన్నద్ధమవుతారు. సామాజిక మాధ్యమాల్లోనూ సురక్షితంగా ఉంటారు. అంతేకాకుండా.. సోషల్ మీడియాను సురక్షితంగా ఉపయోగించినప్పుడే.. దాని నుంచి ప్రయోజనాలను పొందగలుగుతారు. లేకుంటే.. పిల్లలు క్రూరమైన, హింసాత్మక, లైంగికపరమైన చిత్రాలను చూసే అవకాశం ఉంటుంది. ఇది వారి ప్రవర్తనపై దుష్ప్రభావం చూపుతుంది. ఇక చాలా సందర్భాల్లో తెలియకుండా తీసిన ఇబ్బందికరమైన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారు. అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్నీ పంచుకుంటున్నారు. ఫలితంగా, సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతున్నారు.

ఈ సూచనలు పాటించాల్సిందే!: పాస్‌వర్డ్‌లు, లాగిన్ వివరాలను గోప్యంగా ఉంచాలి. వాటిని స్నేహితులతోనూ పంచుకోవద్దు.

పబ్లిక్ వై-ఫైకి కనెక్ట్ అయినప్పుడు సోషల్ మీడియా, ఇతర ఆన్‌లైన్ ఖాతాలను ఉపయోగించవద్దు. ఇతర కంప్యూటర్లు, గ్యాడ్జెట్లను ఉపయోగించిన తర్వాత..అన్ని ఖాతాల నుంచీ తప్పకుండా లాగ్ అవుట్ అవ్వాలి. అన్నిటికన్నా ముఖ్యంగా.. పాప్ అప్‌లపై క్లిక్ చేయవద్దు. అవి అశ్లీలత, స్కామ్ సైట్‌లకు దారితీయవచ్చు. తెలిసిన వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను మాత్రమే అంగీకరించాలి. ఆన్‌లైన్‌లో ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే.. స్క్రీన్‌షాట్ తీసుకొని, వాటి గురించి పెద్దలతో మాట్లాడాలి.

# కావాల్సినంత క్యాల్షియం




క్యాల్షియం సమృద్ధిగా లభిస్తుందని చాలామంది పిల్లలకి ఉదయాన్నే పాలు తాగిస్తుంటారు. పిల్లలేకాదు పెద్దవారు కూడా క్యాల్షియం కోసం పాలు తాగుతుంటారు. వయసు పెరిగేకొద్దీ ఎముకల్లో బలం తగ్గుతుంది కాబట్టి వృద్ధులను కూడా పాలు తాగమని చెబుతుంటారు. క్యాల్షియం సప్లిమెంట్స్ కూడా వాడుతుంటారు. పాలతోపాటు ఈ ఆహార పదార్థాలకు మీ డైట్‌లో చోటివ్వండి. కావాల్సినంత క్యాల్షియం లభిస్తుంది. పాలు తాగకపోతే క్యాల్షియం అందదని చాలామంది అభిప్రాయం. కానీ, అది వాస్తవం కాదు. 100 మి.లీ. ఆవుపాల ద్వారా 120 మి.గ్రా. క్యాల్షియం అందుతుంది. అదే 100 మి.లీ. గేదెపాలు తీసుకుంటే.. 210 మి.గ్రా. క్యాల్షియం లభిస్తుంది. ఇంతకు రెట్టింపు క్యాల్షియం అందించే పదార్థాలు ఉన్నాయి. అవేంటంటే..

బెస్ట్ సోర్స్: ఉలవల్లో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. 100 గ్రా. ఉలవల ద్వారా దాదాపు 290 మి.గ్రా. క్యాల్షియం అందుతుంది. నాన్ వెజ్, పాలు తీసుకోలేని వారికి ఉలవలతో క్యాల్షియం అవసరాలు తీరిపోతాయి.


ఎముకలు ఉక్కులా: రాగులు కూడా క్యాల్షియం రిచ్ సోర్స్. దాదాపు 100 గ్రా. రాగుల ద్వారా 350 మి.గ్రా. క్యాల్షియం లభిస్తుంది. రాగి జావ, రాగి ఇడ్లీ, దోశ, రొట్టె ఇలా రకరకాల రూపాల్లో రాగులు టేస్ట్ చేయొచ్చు. వీటి వల్ల ఎముకలు ఉకులా మారతాయి.

అంతకుమించి: 100 గ్రా. తోటకూరలో దాదాపు 400 మి.గ్రా. క్యాల్షియం ఉంటుంది. ఆకుకూరల్లో క్యాల్షియం సమృద్ధిగా అందించే వాటిలో తోటకూర ముందువరుసలోఉంటుంది.

రుచికి రుచి: 100గ్రా. మునగాకులో 440 మి.గ్రా. క్యాల్షియం ఉంటుంది. మునగాకు పప్పు,తాలింపు, పొడి ఇలా రకాలుగా తినొచ్చు.

సూపర్‌ఫుడ్: అవిసె ఆకులు కూడా క్యాల్షియాన్ని అందించే సూపర్ ఫుడ్‌గా చెబుతుంటారు. దాదాపు 100 గ్రా. అవిసె ఆకుల్లో 1200 మి.గ్రా. కాల్షియం ఉంటుంది. ఎలాగైనా తినొచ్చు: 100 గ్రా. నల్లనువ్వుల్లో 1450 మి.గ్రా. క్యాల్షియం లభిస్తుంది.

# కిచ్‌కిచ్ తగ్గించుకోండి ఇలా



గొంతులో కిచ్‌కిచ్ ఉంటే ఇబ్బందే. మాటిమాటికీ గొంతు సవరించుకోవడం, కఫాన్ని ఉమ్మివేయడం కష్టమే. కొంతమందైతే కఫాన్ని మింగేస్తారు కూడా. అది చాలా ప్రమాదకరం. గొంతులో గరగరగా ఉందంటే మన శరీరంలోకి ప్రవేశించే బ్యాక్టీరియాలతో వ్యాధి నిరోధక శక్తి పోరాడుతున్నట్లు అర్థం. వ్యాధి నిరోధక శక్తి ఓడిపోతున్నప్పుడు మ్యూకస్ (కఫం లేదా శ్లేష్మం) ఏర్పడుతుంది. అది గొంతుకు అడ్డం పడుతుంది. జలుపు, జ్వరం, అలెర్జీలు, కాలుష్యం, పొగ వంటివి గొంతు గరగరకుదారితీస్తాయి.

దీనివల్ల వచ్చేదగ్గు రెండువారాల కంటే ఎక్కువ ఉంటే ప్రాణాంతకమైన క్షయ వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే మనం గొంతులో కిచ్‌కిచ్ అంతు చూద్దాం. అందుకు మందులతో పనిలేదు. మన వంటింట్లో ఉంటే చిట్కాలేంటో చూద్దాం.

పసుపు, పాలు : గోరు వెచ్చని పాలలో అర టీస్పూన్ పసుపు కలిపి తాగాలి. కాస్త నెయ్యి కూడా వేసుకోవచ్చు. గొంతులో గరగర మాయమై గొంతులో హాయిగా ఉంటుంది. అల్లం, దాల్చిన చెక్క : అల్లాన్ని పేస్ట్ చేసి, దాల్చిన చెక్కను పొడి చేసి, వాటితో టీపొడి కలిపి టీ పెట్టుకొని తాగేయాలి. ఇలా రోజుకు మూడుసార్లు చేస్తే చక్కటి ఫలితం ఉంటుంది. కాస్త తేనె కూడా కలుపుకోవచ్చు.

అల్లం టీ: అల్లంలో బ్యాక్టీరియాలను చంపే గుణాలున్నాయి. గొంతులో మంటను తగ్గించే లక్షణాలున్నాయి. కాబట్టి అల్లాన్ని మెత్తగా నూరి టీలో కలిపి ఐదు నిమిషాలు మరిగించి తాగితే గొంతులో కిచ్‌కిచ్ మాయం.పుదీనా టీ : పుదీనా ఆకుల్ని నీటిలో వేసి ఐదు నిమిషాలు మరిగించి, ఆ నీటిని తాగేయాలి. అంతే.. మ్యూకస్ పెట్టే బెడద సర్దుకోవాల్సిందే.చామంతి టీ : ఇది పెద్దగా తెలియకపోవచ్చు. నిజానికి ఇది కూడా బాగా పనిచేస్తుంది. కొన్ని చామంతి రేకుల్ని నీటిలో వేసి మరిగించి తాగేయాలి. ఈ టీ బ్యాక్టీరియాను నాశనం చేస్తుంది. దీనిలో తేనె కూడా కలుపుకోవచ్చు.

# టీడీపీ కొత్త ప్రచారం

ఒంగోలు,: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పరిశీలించిన తర్వాత ఏపీలో అనేక మార్పులు వస్తాయన్న వాదన బలంగా వినిపిస్తోంది. ప్రధానంగా గత ప్రభుత్వాల పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన పార్టీలకు మాత్రమే తమిళనాడు అసెంబ్లీలో చోటు దక్కింది. కానీ ఏపీ విషయానికి వచ్చేసరికి గత ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలను జగన్ వచ్చిన తర్వాత 2019 -24 మధ్య రద్దు చేశారు. వీటిలో ప్రధానంగా అన్నా క్యాంటీన్, షాదీ ముబారక్ వంటి కీలక పథకాలు ఉన్నాయి. అదే విధంగా ఉన్నత విద్యను అభ్యసించే వారికి విదేశాలకు వెళ్లే సదుపాయాన్ని కూడా దాదాపు తీసేశారు. ఇవన్నీ వైసీపీ ప్రభుత్వానికి తీవ్ర ఇబ్బందులు కలిగించాయి. అదే సమయంలో టిడిపికి అనుకూల ఓటు బ్యాంకు ను పెంచాయి. దీనిని గమనించిన చంద్రబాబు వైసీపీ అమలు చేసిన పథకాలను కొనసాగిస్తామని గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అలాగే వాటిని కొనసాగిస్తున్నారు. ఉదాహరణకు అమ్మబడి పేరుతో వైసిపి హయంలో అమలు చేసిన పథకాన్ని తల్లికి వందనం పేరుతో మరింత బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లారుఅదే విధంగా రైతు భరోసా పేరుతో వైసిపి అమలు చేసిన పథకాన్ని అన్నదాత సుఖీభవ పేరుతో అమలు చేస్తున్నారు. అదే సమయంలో అన్న క్యాంటీన్లను తిరిగి తెరిచారు. రాష్ట్రవ్యాప్తంగా వీటిని మరింత పెంచాలని కూడా భావిస్తున్నారు. వీటికి తోడు విదేశీ రుణాలు, షాదీ ముబారక్ వంటి పథకాలను కూడా పునరుద్ధరించారు. ఇక ఇప్పుడు వైసీపీ పరిస్థితి ఏంటి అనేది ప్రశ్నార్థకంగా మారుతుంది. టిడిపి అమలు చేస్తున్న పథకాలను కొనసాగిస్తారా అంటే తమ విధానాలు తమకు ఉన్నాయని ఇటీవల బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి టిడిపి అమలు చేస్తున్న పథకాలు వైసీపీ వస్తే తీసేసే ప్రమాదం ఉందన్నది స్పష్టమవుతుంది. ఇది ఎన్నికల సమయంలో స్పష్టంగా ఆ పార్టీకి ఇబ్బందికర పరిణామాలు సృష్టించడం ఖాయం అవుతుంది. వీటిని టార్గెట్గా చేసుకుని టిడిపి ఇప్పుడు ప్రచారం చేయాలని నిర్ణయించుకుంది. ప్రస్తుతం అమలవుతున్న పథకాలను వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలిస్తే పూర్తిగా రద్దు చేస్తుందని ప్రధానంగా మహిళలకు ఉచితంగా అమల్లోచేస్తున్న బస్సు ప్రయాణాలు రద్దవుతాయని చెప్పనుంది. అదేవిధంగా సూపర్ సిక్స్ పథకాలను కూడా రద్దు చేస్తారని ప్రచారం చేయాలని టిడిపి నిర్ణయించింది. తద్వారా వైసిపిని అడ్డుకునేందుకు సాధ్యమైనన్ని వ్యూహాలను అమలు చేయాలని టిడిపి నాయకత్వం ఒక నిర్ణయానికి వచ్చింది. మహానాడు వేదికగా దీనికి సంబంధించి ప్రకటన చేయనున్నారు. ఎలా చూసుకున్నప్పటికీ ప్రజల్లో విస్తృతంగా ఉన్న కొన్ని పథకాల విషయంలో వైసిపి మారకపోతే కష్టం అనే భావన వినిపిస్తోంది.

పెమ్మసాని ప్లాన్ తో గుంటూరు...: గుంటూరు నగర అభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా మరో అడుగు పడింది. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న పట్టాభిపురం రైతు బజార్ నూతన హైటెక్ భవన నిర్మాణానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవిలతో కలిసి ఘనంగా భూమి పూజ చేశారు. నిత్యం వేలాది మందితో కిటకిటలాడే ఈ మార్కెట్‌ను కార్పొరేట్ స్థాయి వసతులతో ఆధునీకరించేందుకు ఈ మెగా ప్రాజెక్టును చేపట్టారు. వినియోగదారుల కు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దాదాపు రూ. 6 కోట్ల భారీ వ్యయంతో, సుమారు 11,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నూతన రైతు బజార్‌ను నిర్మించనున్నారు. అత్యంత ఆధునిక సాంకేతికతతో గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు రెండు అంతస్తుల భవనంగా ఇది రూపుదిద్దుకోనుంది. ఎండ, వానల నుండి రక్షణ కల్పిస్తూ పూర్తి హైజీనిక్ వాతావరణంలో కూరగాయలు కొనుగోలు చేసేలా ఈ ప్లాన్ డిజైన్ చేశారు. ఈ నూతన మల్టీ-లెవెల్ భవనంలో మొత్తం 100 అత్యాధునిక షాపులను ఏర్పాటు చేస్తున్నారు. సామాజిక, ఆర్థిక సమతుల్యతను పాటిస్తూ ఈ షాపుల కేటాయింపులో స్పష్టమైన ప్రణాళికను ప్రకటించారు. 60 షాపులను, నేరుగా గ్రామాల నుండి వచ్చే అసలైన రైతులకు కేటాయిస్తారు. 30 షాపులను స్వయం సహాయక బృందాలకు చెందిన డ్వాక్రా ( మహిళా వ్యాపారులకు కేటాయిస్తారు. మిగిలిన షాపులను ఇతర నిత్యావసర వస్తువుల విక్రయదారులకు కేటాయించనున్నారు. కేవలం షాపులే కాకుండా, కస్టమర్ల సౌకర్యార్థం ఈ భవనంలో అధునిక పార్కింగ్ సౌకర్యం, స్వచ్ఛమైన తాగునీరు, అత్యాధునిక టాయిలెట్స్ మరియు హైజీన్ వసతులను కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. "గత పాలకుల తీవ్ర నిర్లక్ష్యం వల్లే ఈ భవన నిర్మాణం ఇన్నాళ్లూ జాప్యం అయ్యింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా రైతులకు, వినియోగదారులకు ఒకే చోట మేలు చేయడమే మా లక్ష్యం" అని స్పష్టం చేశారు. అంతేకాకుండా, కేవలం 9 నెలల రికార్డు కాలంలోనే ఈ భవన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

## పారిశ్రామికవాడ అభివృద్ధే లక్ష్యం ఎమ్మెల్యే పాయం



బూర్గంపహాడ్, : పారిశ్రామికవాడ సారపాకను అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక పంచాయతీలోని గాంధీనగర్, భాస్కర్‌నగర్‌లో రూ.85 లక్షలతో నూతనంగా నిర్మించిన 17 సీసీ రోడ్లను సర్పంచ్ కిషోర్‌నాయక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా మార్చుతూ అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుంద న్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన భూక్యా అరుణ, తేజావ త్ జానకి లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లకు ఆయన గృహప్రవేశం చేశారు. అదేవిధంగా ఇటీవల అనారోగ్యానికి గురైన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి నివాసానికి పాయం వెళ్లి పరామర్శించి త్వరగా కోలుకో వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జమలారెడ్డి, తాసీల్దార్ కేఆర్కే.ప్రసాద్, పీఆర్ డీఈ పొదెం వెంకటేశ్వరరావు, ఈఏ చక్రధరా చారి, సర్పంచ్ మందా నాగరాజు, నాయకులు కైపు శ్రీనివాసరెడ్డి, భజన సతీష్, భజన ప్రసాద్, మహిమూదఖాన్, మారం వెంకటేశ్వరరెడ్డి, వారాల వేణు, చంటి, బాలి శ్రీహరి, చల్లా వెంకటనారాయణ, పూలపెల్లి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# భారీ మెజార్టీపై నేతల కన్ను

విశాఖపట్టణం, : టిడిపిలోనే కొందరు నాయకులకు మెజారిటీ సమస్య ఇప్పుడు కొంత గడబిడగా మారింది. గత ఎన్నికల సమయంలో భారీ స్థాయి మెజారిటీతో విజయం దక్కించుకున్న చాలామంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఉదాహరణకు గాజువాక నియోజకవర్గంలో టిడిపి ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఊహించని మెజారిటీని సాధించారు. అదేవిధంగా మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్ కూడా 90 వేల పైచిలుకు మెజారిటీని దక్కించుకున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది నాయకులు భారీ మెజారిటీని సొంతం చేసుకున్నారుఅయితే ఆ సమయంలో కూటమి ప్రభావంతో పాటు వైసిపి వ్యతిరేకత తీవ్ర స్థాయిలో కనిపించింది. దీనివల్లే వీరికి అనూహ్యమైన మెజారిటీ దక్కిందన్న వాదన ఉంది. వచ్చే ఎన్నికల నాటికి ఇదే ప్రభావం కనిపిస్తుందా.. లేకపోతే వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి మారుతుందా.. అనేది ఇప్పుడు కొంతమంది నాయకులలో చర్చనీయాంశంగా మారింది. దీంతో తమ మెజారిటీని తగ్గకుండా చూసుకునేందుకు కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఏఏ మండలాల్లో తమకు ఎక్కువగా ఓట్లు పడ్డాయి.. ఏ ఏ సామాజిక వర్గాల నుంచి తమకు ఓట్లు భారీ సంఖ్యలో పడ్డాయి.. అనే విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. తద్వారా ఆయా మండలాలు, ఆయా సామాజిక వర్గాలను మరింత మంచి చేసుకుని వచ్చే ఎన్నికల సమయానికి తమకు మెజారిటీ పెంచుకోవడంతో పాటు ఒకవేళ పెరిగినా పెరగకపోయినా తమ మెజారిటీని తగ్గకుండా చూసుకునేందుకు నాయకులు ప్రయత్నాలు చేయాలని భావిస్తున్నారు. ముఖ్యంగా గాజువాక నియోజకవర్గంలో పల్లా శ్రీనివాసరావు ఇటీవల పర్యటనలు చేస్తున్నారు. తన సామాజిక వర్గం నాయకులతో పాటు క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కూడా మమేకమవుతున్నారు. మెజారిటీ తగ్గకుండా చూడాలని ఆయన పదేపదే చెబుతున్నారు. గెలుపు అనేది ఖాయమే అయినప్పటికీ మెజారిటీ ఇప్పుడు ప్రతిష్టాత్మక అంశంగా మారింది. ఇక మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ కూడా ఇదే ప్రయత్నాలు చేస్తున్నారు. తనను ఎవరు కలిసినా మెజారిటీపైనే దృష్టి పెట్టాలని ఆయన చెబుతున్నారు. ఈ రెండు నియోజకవర్గాలే కాదు రాష్ట్రవ్యాప్తంగా భారీ మెజారిటీ దక్కించుకున్న నాయకులంతా ఇదే పనిపై దృష్టి పెట్టడం విశేషం. మరి వీరు అనుకున్నట్టుగా మెజారిటీ కొనసాగుతుందా లేకపోతే తగ్గుతుందా అనేది చూడాలి. ప్రస్తుతానికైతే మెజారిటీ తగ్గకుండా చూసుకునేందుకు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికిగాను సంక్షేమ పథకాల అమలతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

# దువ్వాడ లెక్క ఏంటీ



శ్రీకాకుళం, : పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టుగా కొందరు నాయకులు రాజకీయాల్లో వేసే వేషాలు.. అంతగా సక్సెస్ కావన్నది అందరికీ తెలిసిందే. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు పరిస్థితి కూడా ఇలానే ఉంది. వచ్చే ఎన్నికల్లో తనకు టికెట్ ఇవ్వకపోతే.. స్వతంత్రంగానే పోటీ చేస్తానని.. గెలిచి తీరుతానని చెబుతున్నారు. నిజానికి ఇలాంటి ప్రకటనలు చేయడం చాలా తేలిక. కానీ.. నిరూపించుకోవడం, సాధించడం మాత్రం అంత తేలికకాదు. ఒకప్పుడు ఒంటరిగా పోరాటం చేసేందుకు నాయకులు పెద్దగా వెనుకాడాల్సిన అవసరం ఉండేది కాదు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. బలమైన పార్టీల హవా.. ప్రభుత్వాల దూకుడు వంటివి ఎక్కువగా పనిచేస్తున్నాయి. అంతేకాదు, పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను.. వారి గ్రాఫ్‌నుకూడా ప్రజలు తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వచ్చిన తర్వాత అభ్యర్థుల వ్యవహార శైలి కూడా పెద్ద ఎత్తున చర్చకు వస్తోంది. ఇది వ్యక్తిగత అంశాల వరకు కూడా ప్రభావితం అవుతోంది. దువ్వాడ శ్రీనివాస్ వ్యక్తిగత ఇమేజ్ ఇబ్బందుల్లో ఉందనే చెప్పాలి. కుటుంబాన్ని ఆయన దూరం పెట్టి.. సహజీవనం చేస్తున్న వైనం.. సొంత అనుచరుల మధ్యే చర్చకు వస్తోంది. ఇక, నియోజకవర్గం రాజకీయంగా ఇది వివాదం అయ్యే అవకాశం ఉంటుంది. అంతేకాదు.. దువ్వాడకు ఉ న్న వ్యక్తిగత ఇమేజ్ కూడా పెద్దగా కనిపించడం లేదు. నియోజక వర్గంలో ప్రజలకు ఏమైనా సేవ చేసి ఉంటే.. దానిని చెప్పుకొనేందుకు అవకాశం ఉండేది. కానీ, అలాంటిదేమీ లేదు ఇటు వైపు చూసుకుంటే టీడీపీ సీనియర్ నాయకుడు, మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడి ముందు దువ్వాడ తేలిపోతున్నారు. రాజకీయ పరంగా చూసుకున్నా.. వ్యక్తిగతంగా చూసుకున్నా.. రామ్మోహన్ ముందు దువ్వాడ ఎక్కడా సమ ఉజ్జీ కాదన్న వాదన ఉంది. గతంలో ఎప్పుడోపోటీ చేసినప్పుడు భారీ ఓట్లు వచ్చాయని అనుకున్నా.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సోషల్ మీడియాలో దువ్వాడ చిందులు పెద్ద ఎత్తున ప్రచారంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒంటరి పోరు.. దువ్వాడకు చేదు అనుభవమే అవుతుందని అంటున్నారు.

# యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్ విస్తరణ

హైదరాబాద్, : తెలంగాణలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఉప్పుగూడ, మలక్‌పేట రైల్వే స్టేషన్లలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అమృత్ భారత్ పథకం కింద రూ. 26 కోట్లతో ఉ ప్పుగూడ స్టేషన్‌ను డిసెంబర్ కల్లా ఆధునీకరిస్తామన్నారు. అలాగే ఎంఎంటీఎస్ రెండో దశలో భాగంగా భాగ్యనగరం నుంచి యాదగిరిగుట్ట వరకు రైలును పొడిగించనున్నట్లు ప్రకటించారు. గత 12 ఏళ్లలో రాష్ట్రంలో 347 కి.మీ. కొత్త రైల్వే లైన్లు వేసినట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో రైల్వే రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారుల తో కలిసి హైదరాబాద్‌లోని ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ప్రయాణికుల మౌలిక వసతుల కల్పన, ఆధునికీకరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌ను రూ. 26 కోట్ల భారీ బడ్జెట్‌తో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ పనులన్నింటినీ రాబోయే డిసెంబరు నాటికి పూర్తి చేసి ప్రజలకు, స్థానిక ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఆయన మలక్‌పేట రైల్వేస్టేషన్‌ను కూడా సందర్శించి, అక్కడ జరుగుతున్న ప్రగతి పనుల వేగాన్ని సమీక్షించారు. నగర ప్రయాణికులకు తీపి కబురు అందించారు. హైదరాబాద్ నగర శివార్లకు రవాణా సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ఎంఎం టీఎస్ రెండో దశ ప్రాజెక్టులో భాగంగా నగరంలోని ప్రధాన మార్గం నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ రైలు సర్వీసులను పొడిగించనున్నట్లు ప్రకటించారు. దీనివల్ల నిత్యం వేలాది మంది భక్తులకు, ఉద్యోగులకు తక్కువ ఖర్చుతో కూడిన సురక్షిత ప్రయాణం లభిస్తుందన్నారు. గత పాలకుల హయాంతో పోలిస్తే.. గడిచిన 12ఏళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా రికార్డు స్థాయిలో 347 కిలోమీటర్ల మేర నూతన రైల్వేలైన్లను నిర్మించిందని చెప్పారు. అనేక మార్గాలను విద్యుద్దీకరణ, డబ్లింగ్ పూర్తి చేసిందని ఈ సందర్భంగా ఆయన గణాంకాలతో వివరించారు.

హైదరాబాద్‌లోని సబర్బన్ స్టేషన్ల రూపురేఖలను మార్చడమే ధ్యేయంగా కేంద్రం నిధులు కేటాయిస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఉప్పుగూడ, మలక్‌పేట వంటి స్టేషన్లలో కేవలం ప్లాట్‌ఫారాల పొడిగింపు మాత్రమే



కాకుండా..ఆధునిక వెయిటింగ్ హాళ్లు, మెరుగైన లైటింగ్ వ్యవస్థ, ఎస్కలేటర్లు, లిఫ్టులు, దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాలు, సుందరమైన స్టేషన్ ముఖద్వారాలను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

## కవాడీగూడాలో దారుణ ఘటన

### స్పా సెంటర్‌లో భార్యను హత్య చేసిన భర్త

హైదరాబాద్, :గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవాడిగూడలో కట్టుకున్న భార్యను భర్త అతి కిరాతకంగా చంపేశాడు. గొడవ పడి స్పా సెంటర్‌కు వచ్చిన భార్యపై భర్త కత్తితో దాడి చేసి హత్య చేశాడు. అనంతరం నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. బంగి దేబోరా అనే మహిళ తన భర్తతో కలిసి బహదూర్‌పూర్ కిషన్‌బాగ్‌లో నివసిస్తోంది. కవాడిగూడలోని స్పా సెంటర్‌లో మృతురాలు బ్యూటీషియన్‌గా పనిచేస్తోంది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఉదయం కూడా భర్తతో గొడవపడిన దేబోరా.. విధుల కోసం స్పా సెంటర్‌కు వెళ్లింది. భార్య గొడవపడటంతో ఆగ్రహానికి గురైన భర్త.. కవాడిగూడ రత్నదీప్ బిల్డింగ్‌లోని నాలుగో అంతస్తులో ఉన్న స్పా సెంటర్‌కు వెళ్లాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో భార్యపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. హత్య అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఆపై అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలికి చేరుకుని బంగి దేబోరా మృతుదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# దేశంలో చాపకింద నీరులా మతమార్పిళ్లు

**నాసిక్ ఘటన మరువక ముందే మరో ఘటన**

**యూపిలో నెట్‌వర్క్‌ను ఛేదించిన పోలీసులు**

**పదిమంది నిందితుల అరెస్ట్..ముమ్మర దర్యాప్తు**

లక్నో: నాసిక్‌లోని ఓ బహుళజాతి కంపెనీలో బలవంతపు మత మార్పిళ్లు, లైంగిక వేధింపులు చోటుచేసుకోవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అటువంటి మరో ఘటన ఉత్తర్‌ప్రదేశ్ లోని మీర్జాపుర్‌లో వెలుగులోకి వచ్చింది. జిమ్‌లలో చేరే మహిళలను లక్ష్యంగా చేసుకొని మత మార్పిళ్లు చేస్తున్న నెట్‌వర్క్‌ను పోలీసులు గుర్తించారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. మీర్జాపుర్‌లోని ఓ జిమ్ యజమాని మతం మారాలని బలవంతం చేస్తున్నట్లు ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై విచారణ చేస్తుండగా.. దీని వెనుక పెద్ద నెట్ వర్క్ ఉన్నట్లు గుర్తించారు. నిందితులు రాష్ట్రంలోని వివిధ జిమ్‌లు, సోషల్‌మీడియాల్లో ముందుగా మహిళలతో పరిచయాలు పెంచుకొని.. అనంతరం మత మార్పిడి చేసుకోవాలని వారిపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దాదాపు 50 మందికి పైగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో సన్నో అనే మహిళ ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ముందుగా జిమ్‌లలో చేరి అక్కడి యువతులతో పరిచయం పెంచుకుంటుందని.. అనంతరం తన స్నేహితులుగా పేర్కొంటూ పలువురు ముస్లిం యువకులను వారికి పరిచయం చేస్తుందని పేర్కొన్నారు. మరికొందరు మహిళలను నిందితులు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్‌ల ద్వారా పరిచయం పెంచుకొని.. వారిలో మతమార్పిడి ఆలోచనలు కలిగేలా బ్రెయిన్ వాష్ చేసేవారని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్‌లలో వందలాది మంది మహిళల ఫొటోలు, వీడియోలు, చాట్‌లు ఉన్నాయని.. వాటిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కేసు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ దృష్టికి వెళ్లడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. నిందితులపై గ్యాంగ్‌స్టర్ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కేసులో ఇప్పటివరకు 10మంది అనుమానితులను అరెస్ట్ చేశామని.. దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు.

# విజయ్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయం

**సొంత బలం లేకపోవడమే అతిపెద్ద బలహీనత**

**తమిళనాడు మాజీ సిఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు**

చెన్నై, :ప్రముఖ సినీ నటుడు విజయ్ నేతృత్వంలో కొత్తగా ఏర్పడిన టీవీకే ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చని డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయ్ ప్రభుత్వం పూర్తిస్థాయి మద్దతు లేక అస్థిరంగా ఉందని, ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉన్నందున డీఎంకే శ్రేణులు ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. డీఎంకే కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత ప్రభుత్వం ఏక్షణమైనా కూలిపోవచ్చుఅని, డీఎంకే పార్టీ కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉ ండాలన్నారు. సొంతంగా 107 సీట్లు సాధించిన టీవీకే మిత్రపక్షమైన కాంగ్రెస్ 5 సీట్లు, సీపీఐ 2, సీపీఎం 2, వీసీకే 2 సీట్లు సాధించిన డీఎంకే మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇస్తున్న తమ మిత్రపక్షాలైన వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్ మద్దతు నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా, లేదా తమిళనాడు స్పీకర్ గానీ, కోర్టులు గానీ రెబెల్ ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలను చివరికి అనర్హులుగా ప్రకటించినా రాజకీయ అస్థిరత ఏర్పడవచ్చని పేర్కొన్నా రు. గతంలో ఎన్నికల పరాజయాల నుండి డీఎంకే ఎలా పుంజుకుందో గుర్తు చేశారు. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ ఓటమి తాత్కాలికమైందని, తాము మళ్లీ విజయం సాధిస్తామని కార్యకర్తలకు భరోసానిచ్చారు. తమిళనాడులో సూర్యుడు (డీఎంకే గుర్తు) ఎప్పటికీ అస్తమించడు' అని స్టాలిన్ స్పష్టం చేశారు. ఓటమికి వ్యక్తిగత బాధ్యత తీసుకుంటా నని, సోషల్ మీడియాలో పార్టీపై వచ్చే విమర్శలను తిప్పికొట్టాలన్నా రు. ఈ విషయంలో టీవీకే చాలా ముందుందని పరోక్షంగా సూచిం చారు. ఒకప్పుడు మనం టీ దుకాణాల్లో మాట్లాడిన రాజకీయాలను ఇప్పుడు సోషల్ మీడియా వేదికలపై మాట్లాడాలని సూచించారు.



## ఉప్పల్ రింగ్ రోడ్డు మార్గంలో

# ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, : ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల కారణంగా ఉప్పల్ రింగ్ రోడ్డు మార్గంలో మూడు నెలల పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. వరంగల్ వైపు వెళ్లే రహదారిని మూసివేయడంతో వాహనాలను జీఎస్ఐ, బీరప్పగడ్డ, ఉప్పల్ భగాయత్, ఓఆర్ఆర్ మార్గాలకు మళ్లించారు. ఉప్పల్, యాదగిరిగుట్ట బస్టాప్‌లను నల్లచెరువు కట్టకు మార్చారు. హబ్సిగూడ-నాగోల్ మార్గానికి ఎలాంటి ఆంక్షలు లేవు. భారీ వాహనాలను హయాత్‌నగర్, ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ మీదుగా మళ్లించారు. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు అలర్ట్. ఉప్పల్?నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు గాను ఉప్పల్ రింగ్ రోడ్డు పరిధిలో నేటి (ఆదివారం) నుంచి మూడు నెలల పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, రాచకొండ ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ప్రకటించారు. ఉప్పల్ సర్కిల్‌లో వరంగల్ వైపు వెళ్లే ప్రధాన రహదారిని ఆదివారం నుంచి తాత్కాలికంగా మూసివేయనున్నారు. నిర్మాణ సామగ్రి తరలింపు, పిల్లర్ల ఏర్పాటు పనుల దృష్ట్యా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా భారీ ఎత్తున దారి మళ్లింపులు చేపట్టారు. ఇందులో భాగంగా ఉప్పల్ సర్కిల్‌లో ఉన్న వరంగల్ బస్టాప్, యాదగిరిగుట్ట బస్టాప్‌లను తాత్కాలికంగా నల్లచెరువు కట్ట సమీపానికి మార్చారు.రామంతాపూర్ లేదా హబ్సిగూడ వైపు నుంచి వరంగల్ మార్గంలో వెళ్లే వాహనాలను జీఎస్ఐ వద్ద దారి మళ్లించనున్నారు. ఈ వాహనాలు పిస్తా హౌస్, లిటిల్ ఫ్లవర్ స్కూల్ వెనుక భాగం నుంచి బీరప్పగడ్డ మీదుగా వరంగల్ జాతీయ రహదారిని చేరుకోవాల్సి ఉంటుంది. అలాగే నాగోల్, ఎల్బీనగర్ వైపు నుంచి వరంగల్ వెళ్లే వాహనాలు హయాత్‌నగర్ మీదుగా పెద్ద అంబర్‌పేట్ వద్ద ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు పైనుంచి లేదా సర్వీస్ రోడ్డు మార్గంలో ఘట్కేసర్ వద్ద వరంగల్ జాతీయ రహదారికి చేరుకోవాల్సి ఉంటుంది. వరంగల్ వైపు నుంచి హైదరాబాద్ నగరంలోకి వచ్చే వాహనాలను మేఫీల్ హోటల్ వద్ద దారి మళ్లించనున్నారు. ఈ వాహనాలు ఉప్పల్ భగాయత్ మీదుగా నాగోల్ సర్వీస్ రోడ్డులోకి ప్రవేశించి నాగోల్ ఫ్లైఓవర్ వద్ద యూటర్న్ తీసుకుని నగరం లోపలికి రావాల్సి ఉంటుంది.వరంగల్ నుంచి వచ్చే భారీ సరుకు రవాణా వాహనాలను ఓఆర్ఆర్ మీదుగా హయత్‌నగర్‌కు మళ్లిస్తారు. అదేవిధంగా వరంగల్‌కు వెళ్లే భారీ వాహనాలను కూడా హయత్‌నగర్, ఓఆర్ఆర్ మీదుగా ఘట్‌కేసర్‌కు మళ్లించనున్నారు. ఇక పీర్జాదిగూడ వైపు నుంచి సికింద్రాబాద్ వెళ్లే వాహనాలు ఉప్పల్ జంక్షన్ రాకముందే ఉన్న లక్ష్మారెడ్డి కాలనీ మీదుగా ప్రయాణించి ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న మాస్టర్ చెఫ్ రెస్టారెంట్‌కు చేరుకోవాలి. అక్కడ యూ-టర్న్ తీసుకుని సికింద్రాబాద్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. పీర్జాదిగూడ నుంచి నాగోల్ వెళ్లాలన్నా.. నాగోల్ నుంచి వరంగల్ వైపు వెళ్లాలన్నా.. ఉప్పల్ భగాయత్ లేఔట్ మార్గాన్ని ఉపయోగించుకోవాలని అధికారులు సూచించారు. కాగా, హబ్సిగూడ నుంచి నాగోల్ వైపు వెళ్లే వాహనాలకు ఎలాంటి ఆంక్షలు లేవని ఆ మార్గం యథాతథంగా కొనసాగుతుందని ఎంఎంసీ కమిషనర్ స్పష్టం చేశారు. రాబోయే మూడు నెలల పాటు వాహనదారులు పోలీసులకు సహకరించి ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని కోరారు.

# కారేపల్లిలో మొక్కజొన్న స్టాక్ పాయింట్ల తనిఖీ





కారేపల్లి, : కారేపల్లి మండలంలోని మొక్కజొన్న స్టాక్ పాయింట్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్కెటింగ్ శాఖ డీఎం జే.నరేందర్ తనిఖీ చేశారు. అప్పాయిగూడెం గోదాం, జిన్నింగ్ మిల్ స్టాక్ పాయింట్లను డీఎం పరిశీలించారు. సోమవారం రాత్రి కారేపల్లిలో రైతులు అందోళనకు దిగడంతో విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ రైతు సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కారేపల్లి మండల రైతుల మొక్కజొన్నను స్థానికంగానే దిగుమతి చేయడానికి అవకాశాలు పరిశీలించాలని కలెక్టర్ ను ఎమ్మెల్యే కోరారు. కలెక్టర్ ఆదేశాలతో మార్కెటింగ్ డీఎం గోదాంలను పరిశీలించారు. ఈ సందర్భంగా సోసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు బొంతు రాంబాబు, దుగ్గి కృష్ణ జిన్నింగ్ మిల్లు స్టాక్ పాయింట్‌లో కారేపల్లి మండల రైతులకు అవకాశం కల్పించాలని డీఎంను కోరారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఫోన్‌లో డీఎంతో మాట్లాడి స్థానిక రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. డీఎం వెంట సొసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది ఉన్నారు.

## ఎన్‌కే నగర్ పంచాయతీలో..

# పారిశుధ్య కార్మికుల జీతాల నిలుపుదల

### - ఉప సర్పంచ్ నిర్వాకంతో రెండు నెలలుగా వేతనాలు బకాయి



చుంచుపల్లి: చుంచుపల్లి మండల పరిధిలోని ఎన్‌కే నగర్ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు గత రెండు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీలో మొత్తం తొమ్మిది మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తుండగా ప్రతి నెల 10వ తేదీలోపు వారి ఖాతాల్లో జీతాలు జమయ్యేవి. అయితే గత రెండు నెలలుగా వేతనాలు నిలిచిపోవడంతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ సంతకం చేసినప్పటికీ, ఉప సర్పంచ్ డిజిటల్ ఓటీపీ ప్రక్రియ పూర్తికాక పోవడంతో జీతాల చెల్లింపులు ఆగిపోయినట్లు సమాచారం. ఓ ఇంటికి కుళాయి కనెక్షన్ మంజూరు చేసిన విషయంపై ఉప సర్పంచ్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ పంప్ ఆపరేటర్ జీతం నిలిపివేయాలని సూచించినట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. ఈ కుళాయి వ్యవహారమే సర్పంచ్, ఉప సర్పంచ్ మధ్య విభేదాలకు దారితీసిందని, దాని ప్రభావం పారిశుధ్య కార్మికుల జీతాలపై పడిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై సర్పంచ్ శ్రీకాంత్ జిల్లా పంచాయతీ అధికారిణి విద్యాచందనకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఉప సర్పంచ్ మాలోతి లక్ష్మి, ఆమె కుమారుడు సంపత్ కారణంగా పారిశుధ్య కార్మికుల జీతాలు, ఇతర బిల్లులు కూడా రెండు నెలలుగా నిలిచిపోయాయని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఫిర్యాదు నేపథ్యంలో డీఎల్పీఓ కీర్తి ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి వసంత, ఎంపీఓ సంధ్య ఎన్‌కే నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని విచారణ నిర్వహించారు. అయితే ఉప సర్పంచ్ మాలోతి లక్ష్మి ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రికి వెళ్లాల్సి రావడంతో విచారణకు హాజరు కాలేదని అధికారులు తెలిపారు. విచారణ అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇందిరాను పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని డీఎల్పీఓ కీర్తి ప్రభాకర్ ఆదేశించారు. నివేదికను పై అధికారులకు పంపించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండు నెలలుగా జీతాలు అందక కుటుంబ పోషణ కష్టంగా మారిందని, వెంటనే తమ ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని పారిశుధ్య కార్మికులు అధికారులను కోరారు.

# వైసిపి ఆందోళనలకు స్పందన ఏదీ

## పార్టీ నేతలే ఎక్కడా పాల్గొనలేదు
## మండిపడ్డ మాజీమంత్రి సోమిరెడ్డి



నెల్లూరు:పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై వైసీపీ నేతలు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలు పూర్తిగా విఫలమయ్యాయని టీడీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. ఈ ఆందోళనల్లో మీ పార్టీ వాళ్లే పాల్గొన లేదనే విషయం అందరికీ తెలిసిందేనన్నారు. సోమవారం మీరు చేపట్టిన ధర్నాలు చూసి.. మీ పార్టీ నేతలే నవ్వుకుంటున్నారని వ్యంగ్యంగా పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పెట్రోల్, డీజీల్ ధరలు జగన్ ప్రభుత్వ హయాంలోనే పెంచారని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు మీరే ఆందోళన చేయడం ఏమిటని వైసీపీ నేతలను సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. మీ పార్టీ అధినేత వైఎస్ జగన్ రెడ్డి పెంచిన ధరలపై మీరే ఆందోళన చేస్తారా? అంటూ వైసీపీ నేతల తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. టీడీపీ ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు అవుతుందని పేర్కొన్నారు. ఈ సమయంలో పెట్రోల్, డీజిల్‌పై తాము నయాపైసా పెంచామా? అని వైసీపీ నేతలను సూటిగా ఆయన ప్రశ్నించారు.


అసలు విషయాలు తెలుసుకోకుండా వైసీపీ నేతలు రోడడెక్కి ఆందోళన చేయడం సిగ్గు చేటని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అభివర్ణించారు. గతంలో మీ ప్రభుత్వం పెంచిన ధరలపై మీరే ఆందోళన చేయడాన్ని ప్రజలంతా గమనిస్తున్నారనే విషయాన్ని తెలుసుకోవాలంటూ వైసీపీ కేడర్‌కు ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. అసలు వైసీపీకి రాజకీయ పార్టీగా ఉండే అర్హత లేదని ఆయన కుండ బద్దలు కొట్టారు. వైసీపీ హయాంలో అరాచకాలకు

అంతే లేకుండా పోయిందన్నారు. మీ ప్రభుత్వ హయాంలో లిక్కర్ ధరలు పెంచడమే కాకుండా.. నకిలీ మద్యం ఇచ్చి వేలాది మంది ప్రజల ప్రాణాలు తీయలేదా? అంటూ వైసీపీ నేతలను నిలదీశారు. ఆ విషయాలు ఇంకా ప్రజలు మర్చిపోలేదనే విషయాన్ని తెలుసుకోవాలంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పష్టం చేశారు.

# మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండ

**మత్స్యకారుల సేవలో' పథకం కింద రూ.262 కోట్లు విడుదల**
**మన తీరంలో మనదే బోటు..మనదే వేట**
**పొరుగు రాష్ట్రాల మత్స్యకారులకు స్థానం లేదు**
**సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టీకరణ**





నెల్లూరు, : మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తుమ్మలపెంటలో 'మత్స్యకారుల సేవలో' పథకం కింద రూ.262 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. చరిత్రలో తొలిసారి రూ.262 కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. రూ.3,256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. 'బోటూ మనదే.. వేటా మనదే' అని సీఎం అన్నారు. తీరం మనదే.. బోటు మనదే.. వేటా మనదే.. రాజీలేదు. ఎవరైనా వస్తే రానిచ్చే పరిస్థితి లేదు. భయపడేది లేదు. ఎవరి కోసమో మన జీవనోపాధి కోల్పోవడమేంటి? మన తీరంపై మనకే హక్కులుంటాయన్నారు. పొరుగు రాష్ట్రాలు రావడానికి లేదు. బోటు చొరబడగానే కలెక్టర్‌కు మెసేజ్ వస్తుంది. మెసేజ్ రాగానే అప్రమత్తమవుతాం.. ఎవరినీ రానివ్వం అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మత్స్యకారులకు ఎల్లప్పుడూ ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది. వేట నిషేధ సమయంలో రూ.20 వేలు ఆర్థిక భరోసా ఇస్తున్నాం. చరిత్రలో తొలిసారిగా రూ.260 కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో వేశాం. గతేడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్ల సాయం అందించాం. ఇవాళ 1,30,796 కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సాయం అందించాం. 2014-19లో మత్స్యసంపద ఉత్పత్తి 19.18శాతం పెరిగింది. కానీ, వైకాపా హయాంలో నాలుగు రెట్లు పడిపోయింది. వ్యవసాయం, నిర్మాణ రంగం తర్వాత.. మత్స్య సంపదపైనే ఎక్కువ మంది ఆధారపడ్డారు. దేశంలో రొయ్యల ఉత్పత్తిలో 80శాతం ఏపీ నుంచే ప్రపంచానికి ఎగుమతి అవుతున్నాయి. సముద్రపు నీటితో సీవీడ్ కల్చర్ చేస్తే డబ్బులే.. డబ్బులు. మగవాళ్లు వేటకు వెళ్తే.. మహిళలు సీవీడ్ పండించాలి. మహిళలకు ఆదాయం పెంచే మార్గాలు సూచిస్తున్నా.. పాటించండి. మత్స్యకారుల జీవితాలు మెరుగుపడాలి. వారి జీవితాల్లో వెలుగు నింపే బాధ్యత ఈ ప్రభుత్వానిదని సీఎం అన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు ఇబ్బందులు ఉండవన్నారు. జువ్వలదిన్నె హార్బర్‌ను త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. 'జువ్వలదిన్నె హార్బర్ మీ సొంతం.. నకిలీ ప్రచారాలు నమ్మొద్దన్నారు. చేపలు తింటే డయాబెటిస్ రాదన్నారు. 'మీ చేపల ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తా' అని అన్నారు. 200 మెకనైజ్డ్ బోట్ల మంజూరుతో పాటు రాయితీ ఇస్తామన్నారు. ఆక్వాను ఎక్కువ చేయాలని సీఎం పేర్కొన్నారు. వైసీపీ హయాంలో మత్స్యకారుల సాయాన్ని రూపాయి కూడా పెంచలేదని సీఎం విమర్శించారు. 2019-24 మధ్య జగన్ విధ్వంసకర పాలన చేశారని మండిపడ్డారు. 18 నెలల్లో తిరుపతి నుంచి బుల్లెట్ వాహనాలు తయారీ మొదలవనుందని తెలిపారు. ప్రస్తుతం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. టీడీపీ డీఎన్‌ఏలో బీసీలు ఉన్నారని.. మనది తిరుగులేని అనుబంధమని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. పరిశ్రమలు, అభివృద్ధిని గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోందన్నారు. సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌లో స్థానికులకే ఉద్యోగాలు అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రజా సమస్యల పరిష్కారంలో పుచ్చలపల్లిది వీరోచిత పోరాటం'

### - 41వ వర్ధంతి సభలో సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా

బూర్గంపహాడ్: ప్రజా సమస్యల పరిష్కారంలో ఆనాడు పుచ్చలపల్లి సుందరయ్య వీరోచిత పోరాటం చేశారని సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సభ సారపాకలోని సుందరయ్యనగర్‌లో పాపినేని సరోజిని అధ్యక్షతన జరిగింది. తొలుత బూర్గంపహాడ్ మండల కార్యదర్శి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం ఆ రోజుల్లో పుచ్చలపల్లి పోరాట త్యాగం చేశారని, పేద ప్రజల పక్షాన పోరాడి కూలీ రేట్లు పెంచారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సుందరయ్య పోరాట పటిమ ఎనలేనిదని, ఆయన త్యాగాలు ఎప్పటికీ వృథా కావన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలపై భారాలు మోపుతుందని, అదేవిధంగా రాష్ట్రంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకపోతే జూన్ 2న పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని, దీనికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌవులూరి నాగమణి, కమటం మరియమ్మ, మీనా, రాము, రమేష్, ఏడుకొండలు, ప్రకాష్, దమయంతి, ఎస్కో.సహీద, మడకం లత, వెంకమ్మ, శివ పాల్గొన్నారు.






# 'సావిత్రి' ఆటనే మార్చేస్తుందట..




రవికుమార్ సీరపు దర్శకత్వంలో యాక్షన్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కుతున్న చిత్రం 'ది రెడ్ బ్యాగ్'(ప్రస్తుత =వస ధీుస్త్ర). హర్యానా యాక్టర్ కబీర్ దుహన్ సింగ్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఈ మూవీలో పాపులర్ నటి రాశీ కీలక పాత్రలో నటిస్తుంది. ఈ విషయాన్ని షేర్ చేస్తూ మేకర్స్ షేర్ చేసిన కొత్త అప్‌డేట్ మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. రాశీ టీంలో జాయిన్ అయినట్టు తెలియజేస్తూ.. కొన్ని పాత్రలు కేవలం కథకు సపోర్ట్‌గా నిలుస్తాయి. కానీ సావిత్రి మాత్రం మొత్తం ఆటనే మార్చేస్తుంది.. అంటూ నయా అప్‌డేట్ షేర్ చేశారు మేకర్స్. సావిత్రి పాత్ర సినిమాకు బ్యాక్ బోన్‌గా ఉండబోతున్నట్టు తాజా న్యూస్ హింట్ ఇచ్చేస్తుంది. రాధ్య, స్నేహా సింగ్, ఆకాంక్ష ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి ఈ మూవీలో ప్రసాద్ బెహరా ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే రిలీజ్ చేసిన ది రెడ్ బ్యాగ్ మూవీ ప్రీ లుక్‌లో నలుగురు అమ్మాయిలతో రిలీజ్ చేసిన పోస్టర్‌తో బ్యాగ్ చుట్టూ తిరిగే కథాంశంతో సాగే డిఫరెంట్ కాన్సెప్ట్‌తో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చారు. మరో పోస్టర్‌లో చేతినిండా రక్తం, ఆ బ్యాగును పట్టుకున్న తీరు, అక్కడే ఉన్న కత్తులు, తుపాకులు, రక్తపుమయంగా మారిన ఏరియా ఇలా ప్రతీ ఒక్కటి ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. రవికుమార్ సీరపు ది రెడ్ బ్యాగ్‌కు దర్శకత్వం వహిస్తుండటమే కాకుండా కథ, కథనం సమకూరుస్తున్నాడు. నిర్మాత హరికృష్ణ సోమిశెట్టికి డెబ్యూ సినిమానే అయినా భారీ బడ్జెట్‌తో సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం. ఇంతకీ ది రెడ్ బ్యాగులో ఏముంది.. అనేది టీజర్‌తో ఏమైనా హింట్ ఇస్తారేమో చూడాలి.

## తిలక్ వర్మతో అఫైర్ అంటూ వార్తలు...

# ప్రకటన విడుదల చేసిన శ్రీలీల టీమ్



ప్రముఖ నటి శ్రీలీల, యువ క్రికెటర్ తిలక్ వర్మ మధ్య ప్రేమాయణం నడుస్తోందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ఆమె టీమ్ ఫుల్‌స్టాప్ పెట్టింది. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అవన్నీ పూర్తిగా నిరాధారమైన, అవాస్తవ కథనాలని అధికారికంగా స్పష్టం చేసింది. ఈ మేరకు శ్రీలీల బృందం ఒక ప్రకటన విడుదల చేసింది. "శ్రీలీల, తిలక్ వర్మకు సంబంధించి వ్యాప్తి చెందుతున్న పుకార్లు పూర్తిగా నిరాధారమైనవి, అసత్యమైనవి. వారిద్దరూ ఇప్పటివరకు ఒకరినొకరు కనీసం కలుసుకోలేదు, మాట్లాడుకోలేదు కూడా. ఈ ఊహాగానాల్లో ఎలాంటి వాస్తవం లేదు. వాస్తవ నిర్ధారణ లేకుండా ఇలాంటి కల్పిత కథనాలను ప్రచారం చేయవద్దని కోరుతున్నాం," అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ సోషల్ మీడియా ఖాతాలతో పాటు పాటు కొన్ని మీడియా వేదికల్లోనూ కథనాలు వెలువడిన నేపథ్యంలో శ్రీలీల టీమ్ ఈ వివరణ ఇచ్చింది. వ్యక్తిగత విషయాలపై వార్తలు రాసేటప్పుడు మీడియా, సోషల్ మీడియా యూజర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ధృవీకరించని సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దని విజ్ఞప్తి చేసింది. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై తరచూ ఇలాంటి పుకార్లు రావడం సహజమే అయినప్పటికీ, ఈ ప్రచారం ఎక్కువ కావడంతో వెంటనే స్పందించి పుకార్లకు అడ్డుకట్ట వేయాలని శ్రీలీల బృందం నిర్ణయిం చుకుంది. ఈ అధికారిక ప్రకటనతో శ్రీలీల, తిలక్ వర్మ రిలేషన్‌షిప్‌పై వస్తున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది.

# 'నాన్న దగ్గరికి వెళ్తే హెల్మెట్ పెట్టుకోండి'



సినీ నటుడు మంచు మనోజ్ తన పుట్టినరోజు సందర్భంగా మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గత కొంతకాలంగా మంచు కుటుంబంలో జరుగుతున్న అంతర్గత విభేదాలు, ఆస్తి గొడవలు సర్వత్రా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మీడియా ప్రతినిధులు ఆయనను పాత వివాదాలను ప్రస్తావిస్తూ ఒక ఆసక్తికరమైన ప్రశ్న వేశారు. మీ ఫ్యామిలీ ఇష్యూస్ అన్నీ ఇప్పుడు క్లియర్ అయినట్టేనా? అని ఒక విలేకరి అడగ్గా.. మనోజ్ ఏమాత్రం తడుముకోకుండా, తనదైన శైలిలో నవ్వుతూ వ్యంగ్యంగా సమాధానమిచ్చారు. "ఆ ప్రశ్న ఎవరిని అడగాలో మీ అందరికీ బాగా తెలుసు... వెళ్లి ఆయన్నే అడగండి. కానీ ఒక్కటి మాత్రం గుర్తుపెట్టుకోండి.. మైక్ పట్టుకుని కాదు, తలకు హెల్మెట్ పెట్టుకుని వెళ్లండి'! అని మనోజ్ నవ్వుతూ చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## కమల్ హాసన్ పొదుపు మంత్రం

# ఎకానమీ సీట్లో హైదరాబాద్‌కు రాక




విశ్వనాయకుడు కమల్‌హాసన్ తీసుకున్న ఓ నిర్ణయంతో ఆయన ఎంత గొప్ప నటుడో, ఆయన వ్యక్తిత్వం ఎంత గొప్పదో చెబుతూ వైజయంతీ మూవీస్ సంస్థ ఓ ట్వీట్ చేసింది.

ఇటీవల కాలంలో సినిమా షూటింగ్ బడ్జెట్ కన్నా నటీనటులకు కల్పించే సౌకర్యాలు ఖర్చే ఎక్కువ అవుతోంది. మేకర్స్ అనవసరపు ఆర్భాటాల తగ్గించుకోవాలంటూ కమల్ హాసన్ ఇటీవల ఓ ప్రకటన జారీ చేశారు. అంతేకాదు దానిని ఆచరణ రూపంలోనూ చూపించారు. ఈ నేపథ్యంలో ఆయన 'కల్కి' సీక్వెల్ షూటింగ్‌కు ఎకానమీ ఫ్లైట్‌లో హైదరాబాద్‌కు వచ్చారు. దీనిని ఉదహరిస్తూ వైజయంతి మూవీస్ సంస్థ ఆయనను అభినందించింది.'

ప్రస్తుతం సినిమా పరిశ్రమ నిర్మాణపరంగా ఎంతో కష్టాలను ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో కమల్‌హాసన్ ప్రైవేట్ చార్టర్ విమానాలు, విలాసవంతమైన ప్రయాణాలను పక్కనపెట్టి, ఎకానమీ ఫ్లైట్‌లో నేరుగా షూటింగ్ సెట్‌కు వస్తున్నారు. ఆ నిర్ణయం ఆయన ఎంతటి దిగ్గజమో తెలియజేస్తోంది. చిత్ర పరిశ్రమలో అద్భుతాలు జరగడానికి ఇది మొదటి అడుగు అనుకోవచ్చు' అని ట్వీట్‌లో వైజయంతి మూవీస్ సంస్థ పేర్కొంది. ప్రభాస్ హీరోగా నాగ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి కొనసాగింపుగా కల్కి పార్ట్ 2 రూపొందుతున్న సంగతి తెలిసిందే! ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇందులో కమల్ సుప్రీం యాస్కిన్‌గా నటిస్తున్నారు.

# ఎన్టీఆర్.. అర్ధరాత్రికి డ్రాగన్ గ్లింప్స్ విడుదల



యంగ్ టైగర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా చిత్రం నుంచి ఎట్టకేలకు ఒక భారీ అప్‌డేట్ వచ్చేసింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానుల కోసం ఒక అద్భుతమైన సర్ప్రైజ్ ప్లాన్ చేశారు. ఈ రోజు అర్ధరాత్రి సరిగ్గా 11:52 గంటలకి ఈ చిత్రం యొక్క ఫస్ట్ గ్లింప్స్ డిజిటల్ ఎ లాట్‌ఫార్మ్‌తో పాటు, ఎంపిక చేసిన థియేటర్లలో భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో గట్టి టాక్ వినిపిస్తోంది. సెన్సార్ బోర్డ్ వెబ్‌సైట్‌లో కూడా 'గ్లింప్స్ ఆఫ్ డ్రాగన్' పేరుతో సర్టిఫికేట్ పొందినట్లు సమాచారం రావడంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ రాత్రి గ్లింప్స్ ద్వారా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. సాధారణంగా వచ్చే టీజర్లు లేదా గ్లింప్స్‌లు ఒకటి లేదా రెండు నిమిషాలు మాత్రమే ఉంటాయి. కానీ, ప్రశాంత్ నీల్ ఈసారి భిన్నంగా ఏకంగా 4 నిమిషాల 35 సెకన్ల రన్ టైమ్‌తో ఈ గ్లింప్స్‌ను కట్ చేసినట్లు తెలుస్తోంది. సినిమా యొక్క కథా నేపథ్యాన్ని, ఆ ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయడం కోసమే ఇంత సుదీర్ఘమైన విజువల్స్‌ను ప్లాన్ చేశారట. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ హై బ్జడెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలకు ఊపిరి పోసిన రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ క్రేజీ పాన్-ఇండియా విజువల్ వండర్ జూన్ 11, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

## భోపాల్‌లో పెద్ది సందడి

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. జూన్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ నగరాల్లో దీని స్పెషల్ ఈవెంట్‌ను నిర్వహించాలని టీమ్ భావిస్తోంది. తాజాగా ముంబయిలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగిన విషయం తెలిసిందే. దీని తర్వాత మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఏఆర్ రెహమాన్‌తో లైవ్ కాన్సర్ట్‌ను నిర్వహించనున్నారు. భారీ స్థాయిలో జరగనున్న ఈ ఈవెంట్ కోసం టీమ్ పనులు ప్రారంభించింది. తాజాగా భోపాల్‌లోని బీహెచ్‌ఈఎల్ గ్రౌండ్స్‌లో పూజా కార్యక్రమాన్ని నిర్వహించింది.

ఇప్పటికే 'పెద్ది'నుంచి వచ్చిన రెండు పాటలు సూపర్ హిట్‌గా నిలిచి కోట్లలో వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు స్పెషల్ సాంగ్ రానుండడంతో అందరిలో ఆసక్తి నెలకొంది. 'పెద్ది'లో స్పెషల్ సాంగ్ హైలైట్‌గా నిలుస్తుందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బుచ్చిబాబు తెలిపారు. ఆ పాట ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ బ్లాస్ట్ అని పేర్కొన్నారు. ఇక తాజాగా విడుదలైన 'పెద్ది' ట్రైలర్ అన్ని భాషల్లో కలిపి 63 మిలియన్ల వ్యూస్ వచ్చినట్లు టీమ్ తెలిపింది. అన్ని సోషల్ మీడియా వేదికల్లోనూ అది ట్రెండింగ్‌లో ఉందని పేర్కొంది.

Pub ished & Owned by Mamidi Somaiah, H.No.3 2 92/27 to 276/506, Rock Town Co ony, B Nagar, Hyd, Rangareddy, Te angana 500068. Printed at E ora Printers, N Nagar, Industria Estate, Uppa , Rangareddy, Te angana. Editor Mamidi Somaiah. Ph No. 9 00933723.RNI No. TE TE . 12/48343